తెలంగాణ TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | మంగళవారం-19- ఆగస్టు - 2025 | సంపుటి : 3 | సంచిక : 84 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




ముఖ్యమంత్రి మాట్లాడుతూ, వందేళ్లుగా ఎదురుచూస్తున్న బడుగు, బలహీన వర్గాలకు న్యాయం చేయాలన్న సంకల్పంతో తెలంగాణలో తొలిసారిగా కుల గణన పూర్తి చేశామని చెప్పారు. ప్రతి 150 ఇండ్లకు ఒక ఎన్యుమరేటర్ చొప్పున 95 వేల మంది రెండు నెలలపాటు ఇంటింటికీ తిరిగి సమగ్ర సమాచారం సేకరించారని, ఆ సమాచారాన్ని కంప్యూటరైజ్ చేసి క్రోడీకరించామని వివరించారు. కుల గణనలో ఎక్కడా ఒక్క తప్పూ లేదని, దానిని వక్రీకరించే ప్రయత్నాలు జరిగితే రాబోయే వందేళ్లలోనూ బహుజనులకు న్యాయం జరగదని స్పష్టం చేశారు.

# బహుజనుల తలరాత మార్చేది చదువే

- సీఎం రేవంత్ రెడ్డి
- సర్దార్ సర్వాయి పాపన్న 375వ జయంతి వేడుకల్లో ముఖ్యమంత్రి ప్రసంగం
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పిల్లల కోసం యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లు
- కుల గణన ఆధారంగా 42% రిజర్వేషన్లు కల్పించనున్న ప్రభుత్వం
- ఖిలాషాపూర్ కోటను చారిత్రక క్షేత్రంగా అభివృద్ధి చేస్తున్నామన్న హామీ

హైదరాబాద్,ఆగస్టు18(తెలంగాణ ముచ్చట్లు): బహుజనులు సమాజంలో నిలదొక్కుకోవాలన్నా, ఎదగాలన్నా చదువు ఒక్కటే మార్గమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. బహుజనులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, అందులో భాగంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల కోసం రాష్ట్రవ్యాప్తంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన సర్దార్ సర్వాయి పాపన్న 375వ జయంతి వేడుకల్లో ముఖ్యమంత్రి పాల్గొని పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు, సలహాదారులు, ప్రజాప్రతినిధులు హాజరైన ఈ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ,

మిగతా 2లో



# ట్యాంక్ బండ్‌పై సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి శంకుస్థాపన చేసిన సిఎం



హైదరాబాద్,ఆగస్టు18(తెలంగాణ ముచ్చట్లు): తెలుగు బహుజన చరిత్రలో తొలి చక్రవర్తిగా నిలిచిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ విగ్రహం హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు కానుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విగ్రహానికి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న బహుజన సమాజానికి ఆదర్శంగా నిలిచారని, ఆయన పోరాట స్ఫూర్తి తరతరాలకు ప్రేరణనిస్తుందని తెలిపారు. తెలంగాణ సమాజ చరిత్రలో పాపన్న స్థానాన్ని గుర్తుంచుకునేలా రాష్ట్ర ప్రభుత్వం ఈ విగ్రహాన్ని ప్రతిష్టించబోతోందని చెప్పారు. శంకుస్థాపన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నగర మేయర్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పేదల చిరకాల వాంఛ నెరవేరింది



- ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలకు ముహూర్తం ఖరారు
- భద్రాద్రి రాముని సన్నిధిలో ప్రారంభమైన పథకం
- అదే భగవంతుని ఆశీస్సులతో గృహప్రవేశం
- బెండలపాడు గ్రామంలో 27 ఇండ్ల గృహప్రవేశం సిఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా
- హెలిపాడ్, సభా ప్రాంగణం, పోలీసు బందోబస్తు ఏర్పాట్లను ఎమ్మెల్యేలతో కలిసి పరిశీలన
- లక్ష మందితో జరగనున్న మహోత్సవం
- కులమతాలకు అతీతంగా విజయవంతం చేయాలని పిలుపు

2లో



# భారతీయ సినిమా నిర్మాణ కేంద్రంగా హైదరాబాద్‌ను నిలబెట్టాలి

- జాతీయ చలనచిత్ర అవార్డులు పొందిన సినీ ప్రముఖులను సీఎం సన్మానం
- సినిమా పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్లను ప్రభుత్వం దృష్టిలోకి తీసుకుంటామన్న భరోసా
- సినిమా అభివృద్ధికి అవసరమైన చేయూత అందిస్తామని హామీ ఇచ్చిన సీఎం
- భగవంత్ కేసరి,హనుమాన్,బేబి చిత్ర బృందాలకు సీఎం అభినందనలు

2లో

# టీ-ఫైబర్ పనులపై సమగ్ర నివేదిక కోరిన సీఎం

టీ-ఫైబర్ పనులపై సమగ్ర నివేదిక కోరిన సీఎం రేవంత్ రెడ్డి

2లో



# కార్పొరేట్ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

2లో



# అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యకు ప్రత్యేక చర్యలు

- జీరో ఎన్రోల్మెంట్ పాఠశాలల వినియోగం
- 21 జిల్లాల్లో 61 పాఠశాలల గుర్తింపు
- 34 పాఠశాలల్లో పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభం
- సెప్టెంబర్ 1లోపు తరగతుల ప్రారంభానికి జిల్లా అధికారులకు ఆదేశాలు
- ప్రైవేటు ప్లే స్కూల్ల స్థాయిలో నాణ్యమైన విద్య అందిస్తున్న అంగన్‌వాడీలు

హైదరాబాద్,ఆగస్టు18(తెలంగాణ ముచ్చట్లు): రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయడానికి ప్రభుత్వం విస్తృత చర్యలు చేపట్టింది. మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు అధికారులు ఇప్పటికే కసరత్తు ప్రారంభించారు.

మిగతా 3లో



# తన స్వగ్రామంలో అంగన్‌వాడీ, పాలన కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి సీతక్క

- స్వగ్రామంలో చిన్నారుల భవిష్యత్తుకు శంకుస్థాపన చేసిన మంత్రి
- తల్లుల ఉపాధికి భరోసా కల్పించే పాలన కేంద్రాలు
- చిన్నారుల కోసం ఆట వస్తువులు, అవసరమైన సదుపాయాలు ఏర్పాటు
- మూడేళ్ల లోపు పిల్లల సంరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

3లో



# హైదరాబాద్ కూకట్‌పల్లిలో దారుణం

- పదేళ్ల బాలిక దారుణ హత్య
- సంగీత్‌నగర్‌లో దారుణ ఘటన
- సెలవు కావడంతో ఇంట్లోనే ఉండిపోయిన కుమార్తె
- తండ్రి వచ్చేసరికి కత్తిపోట్లతో విగతజీవిగా పడి ఉన్న కుమార్తె

3లో

# దివంగత నటుడు కోట సతీమణి కోట రుక్మిణి హఠాన్మరణం

హైదరాబాద్, ఆగస్టు 18: దివంగత నటుడు కోట శ్రీనివాసరావు సతీమణి కోట రుక్మిణి హఠాన్మరణం చెందారు. అనారోగ్య కారణాలతో ఆమె మృతి చెందినట్టు సమాచారం. ఇటీవలే కోట శ్రీనివాసరావు చనిపోవడంతో అప్పటి నుంచి ఆమె ఆరోగ్యం మరింతగా క్షీణించినట్టు తెలుస్తోంది. రుక్మిణి వయస్సు 75 సంవత్సరాలు.సోమవారం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో రుక్మిణి కన్నుమూశారు.

మిగతా 2లో



# విద్యార్థినిపై లైంగిక వేధింపులు

- చందానగర్ ప్రైవేట్ హాస్పిటల్‌లో విద్యార్థినిపై దారుణం
- హెచ్‌సీయూ విద్యార్థిని పై అసభ్యంగా ప్రవర్తించిన వార్డ్ బాయ్
- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధిత విద్యార్థిని
- గోప్యంగా ఉంచుతున్న హాస్పిటల్ నిర్వాహకులు, పోలీసులు
- కఠిన చర్యలు తీసుకోవాలని బాధితురాలి డిమాండ్




హైదరాబాద్, ఆగస్టు 18: చందానగర్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న విద్యార్థినిపై అదే ఆస్పత్రిలోని వార్డ్ బాయ్ అసభ్యంగా ప్రవర్తించాడు. చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పీఆర్కే హాస్పిటల్‌లో ఈ దారుణ ఘటన చోటు చేసుకుంది.

మిగతా 3లో

# రామంతాపూర్‌లో ఉద్రిక్తత..

- అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదమని ఆరోపణలు
- విద్యుత్ శాఖ సీఎండీని అడ్డుకున్న బాధితుల కుటుంబాలు
- రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేసిన స్థానికులు
- ప్రతి కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం డిమాండ్
- ప్రతి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ఆవశ్యకత
- ఘటనా స్థలంలో పోలీసుల మోహరింపు, తోపులాటలు

2లో



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# రామంతాపూర్‌లో ఉద్రిక్తత..

**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు:**



రామంతాపూర్‌లో ఉద్రికత్త చోటుచేసుకుంది. అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని ఆరోపిస్తూ బాధితుల కుటుంబ సభ్యులు ఆందోళనలకు దిగారు. దీంతో, బాధిత కుటుంబ సభ్యులకు, అధికారులకు మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. మరోవైపు.. రామంతాపూర్‌లో పోలీసులు, అధికారులను మృతుల బంధువులు నిలదీస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో ఘటనా స్థలాన్ని పరిశీలించేందుకు వెళ్లిన విద్యుత్ శాఖ సీఎండీని బాధితులు అడ్డుకున్నారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ.. రోడ్డుపై బైఠాయించి కుటుంబ సభ్యులు, స్థానికులు ఆందోళన చేపట్టారు.
ప్రమాదంలో చనిపోయిన ఆరు కుటుంబాలకు న్యాయం చేయాలంటూ ఆందోళనకు దిగారు. చనిపోయిన ప్రతి కుటుంబానికి కోటి రూపాయలు నష్టపరిహారం, ప్రతి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలంటూ నినాదాలు చేస్తున్నారు. దీంతో, ఘటనా స్థలంలో భారీగా పోలీసులు మోహరించారు. ఈ క్రమంలో పోలీసులు, మృతుల బంధువులకు మధ్య తోపులాట జరిగింది. పోలీసలు.. అక్కడున్న వారిని చెదరగొట్టే ప్రయత్నం చేస్తున్నారు.
ఇదిలా ఉండగా.. రామంతాపూర్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుక విషాదకర ఘటనలో మృతుల సంఖ్య ఆరుకు చేరుకుంది. ఊరేగింపు రథానికి కరెంట్ తీగలు తగిలి ఐదుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందారు. మరో వ్యక్తి చికిత్స పొందుతూ చనిపోయినట్టు వైద్యులు తెలిపారు. దీంతో, మృతుల కుటుంబాల సభ్యులు కన్నీటి పర్యంత మవుతున్నారు.

# బహుజనుల తలరాత మార్చేది చదువే

(మొదటి పేజీ తరువాయి)



పాపన్న బడుగు బలహీన వర్గాల పక్షాన నిలబడి చేసిన పోరాటం సమాజానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. అందుకే సచివాలయం ఎదురుగా ట్యాంక్‌బండ్‌పై పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. అలాగే ఖిలాషాపూర్ కోటను చారిత్రక క్షేత్రంగా, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు.
ముఖ్యమంత్రి మాట్లాడుతూ, వందేళ్లుగా ఎదురుచూస్తున్న బడుగు, బలహీన వర్గాలకు న్యాయం చేయాలన్న సంకల్పంతో తెలంగాణలో తొలిసారిగా కుల గణన పూర్తి చేశామని చెప్పారు. ప్రతి 150 ఇండ్లకు ఒక ఎన్యుమరేటర్ చొప్పున 95 వేల మంది రెండు నెలలపాటు ఇంటింటికీ తిరిగి సమగ్ర సమాచారం సేకరించారని, ఆ సమాచారాన్ని కంప్యూటరైజ్ చేసి క్రోడీకరించామని వివరించారు. కుల గణనలో ఎక్కడా ఒక్క తప్పూ లేదని, దానిని వక్రీకరించే ప్రయత్నాలు జరిగితే రాబోయే వందేళ్లలోనూ బహుజనులకు న్యాయం జరగదని స్పష్టం చేశారు.
కుల గణన ఆధారంగా బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం, విద్యా ఉద్యోగావకాశాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ మంత్రిమండలి తీర్మానించిందని, రెండు బిల్లులు శాసనసభలో ఆమోదించబడి గవర్నర్ ద్వారా రాష్ట్రపతికి పంపించబడ్డాయని తెలిపారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 50 శాతం దాటకుండా చేసిన గత ప్రభుత్వంలోని పంచాయతీ రాజ్ చట్టం అడ్డంకిగా మారిందని, ఆ గరిష్ట పరిమితిని తొలగించే ఆర్డినెన్స్ కూడా జారీ చేశామని వివరించారు. ఈ మూడు అంశాలు ప్రస్తుతం రాష్ట్రపతి ఆమోదానికి పెండింగ్‌లో ఉన్నందున, వాటిని ఆమోదించాలని కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలంతా ఢిల్లీలో ఆందోళన చేసినట్టు చెప్పారు.
దేశంలో మత ప్రాతిపదికన రిజర్వేషన్లకు చట్టపరంగా తావు లేదని, తెలంగాణ ప్రభుత్వం పంపిన బిల్లులు, ఆర్డినెన్స్‌లో దానికి సంబంధించిన ఒక్క పదం కూడా లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వెనుకబాటు తనం ఆధారంగానే రిజర్వేషన్లు కల్పించామని ఆయన పేర్కొన్నారు. సమస్యలన్నింటినీ ఒక్కొక్కటిగా అధిగమిస్తూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందని, ప్రస్తుత పరిస్థితుల్లో చదువుతోనే బహుజనులు తమ తలరాత మార్చుకోగలరని ఆయన ఉద్ఘాటించారు.
ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సలహాదారులు కే. కేశవరావు, వేంనరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ మరియు పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మేయర్, కార్పొరేషన్ చైర్మన్లు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



# భారతీయ సినిమా నిర్మాణ కేంద్రంగా హైదరాబాద్‌ను నిలబెట్టాలి

**-సీఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్,ఆగస్టు18(తెలంగాణ ముచ్చట్లు):**

హైదరాబాద్ నగరాన్ని భారతీయ సినిమా నిర్మాణానికి ప్రధాన కేంద్రంగా నిలబెట్టే కృతనిశ్చయంతో ఉన్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సినిమా రంగానికి అవసరమైన ప్రోత్సాహక చర్యలు తీసుకుంటూ, అన్ని విధాల సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు.జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో 71వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో వివిధ విభాగాల్లో ఎంపికైన సినీ ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సినీ పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్లను ఈ సందర్భంగా ప్రముఖులు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. దీనికి స్పందించిన సీఎం, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు.
ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలకు సీఎం అభినందనలు తెలియజేస్తూ వారిని సన్మానించారు. భగవంత్ కేసరి చిత్రం దర్శకుడు అనిల్ రావిపూడి, హనుమాన్ సినిమా దర్శకుడు ప్రశాంత్ వర్మ, విజువల్ ఎఫెక్ట్స్ విభాగానికి చెందిన వెంకట్, శ్రీనివాస్, ఫైట్ మాస్టర్స్ నందు, పృథ్వీ, బేబి సినిమా దర్శకుడు సాయి రాజేశ్, గాయకుడు రోహిత్‌లను ప్రత్యేకంగా అభినందించారు .ఈ కార్యక్రమంలో హనుమాన్ సినిమా నిర్మాతలు చైతన్య రెడ్డి, నిరంజన్ రెడ్డి, బేబి సినిమా నిర్మాత ఎస్కేఎన్, భగవంత్ కేసరి నిర్మాత గారపాటి సాహు తదితరులు పాల్గొన్నారు.



# టీ-ఫైబర్ పనులపై సమగ్ర నివేదిక కోరిన సీఎం

**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు:**

రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇంటికి, ప్రతి గ్రామానికి వేగవంతమైన ఇంటర్నెట్ సేవలు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన టీఫైబర్ ప్రాజెక్ట్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఇప్పటి వరకు జరిగిన పనుల తీరుపై, ప్రస్తుత పరిస్థితిపై, భవిష్యత్‌లో చేపట్టాల్సిన చర్యలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు.ముఖ్యమంత్రి నివాసంలో జరిగిన ఈ సమీక్షలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కూడా పాల్గొన్నారు. ఇప్పటి వరకు పనులు నిర్వహించిన కాంట్రాక్ట్ సంస్థలకు నోటీసులు జారీ చేసి, వారు చేసిన పనుల నాణ్యత, పురోగతిపై పూర్తి వివరాలతో నివేదిక కోరాలని సీఎం స్పష్టం చేశారు. అదేవిధంగా సంస్థలోని ఉద్యోగుల సంఖ్య, వారి పని తీరును కూడా సమీక్షించాలని సూచించారు.

ప్రతి పల్లెకు, ప్రతి ఇంటికి ఆధునిక ఇంటర్నెట్ సేవలు అందించడమే టీఫైబర్ లక్ష్యమని గుర్తు చేసిన సీఎం, ప్రాజెక్ట్ విజయవంతం కావాలంటే పూర్తి స్థాయి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. ఇప్పటి వరకు జరిగిన వ్యయం, పూర్తి కావడానికి అవసరమైన నిధులు, వాటి సేకరణ మార్గాలు, అలాగే ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలను నివేదికలో పొందుపరచాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో పాటు ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# కార్పొరేట్ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

**-మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**హైదరాబాద్,ఆగస్టు18(తెలంగాణ ముచ్చట్లు):**



రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించేందుకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖలో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ సంస్కరణల వల్ల ఇప్పటికే ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయని, భవిష్యత్తులో మరింత సౌకర్యవంతంగా ఉండేలా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను పునర్వ్యవస్థీకరించి సమీకృత భవనాల్లో ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు.
హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 11 సమీకృత భవనాల్లోకి తీసుకురానున్నామని మంత్రి తెలిపారు. గచ్చిబౌలిలోని తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ (తాలిమ్) కార్యాలయంలో రంగారెడ్డి రిజిస్ట్రార్ ఆఫీస్‌తో పాటు గండిపేట, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్ కార్యాలయాలను సమీకరిస్తున్నామని వివరించారు. ఈ ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రోల్ మోడల్‌గా నిలుస్తుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 20న గచ్చిబౌలిలో ఈ భవనానికి శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు.
అబ్దుల్లాపూర్ మెట్, పెద్దఅంబర్‌పేట్, హయత్‌నగర్, వనస్థలిపురం పరిధిలో కోహెడ్‌లో, మహేశ్వరం, ఇబ్రహింపట్నం, శంషాబాద్ పరిధిలో మహేశ్వరం మండలంలోని మంకాల్‌లో, మేడ్చల్, కుత్బుల్లాపూర్, కీసర, శామీర్‌పేట్ పరిధిలో కండ్లకోయలో, ఉప్పల్, నారపల్లి, కాప్రా, ఘట్‌కేసర్, మల్కాజ్‌గిరి పరిధిలో బోడుప్పల్‌లో, బంజారాహిల్స్, ఎస్.ఆర్.నగర్, గోల్కొండ పరిధిలో బంజారాహిల్స్‌లో, ఆజంపుర, చార్మినార్, దూద్‌బౌలి పరిధిలో మలక్‌పేట్‌లో కొత్తగా ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు నిర్మించనున్నట్లు తెలిపారు. మరో పదమూడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల కోసం నాలుగు చోట్ల స్థలాలు గుర్తించాలని కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చినట్టు వెల్లడించారు.
ప్రజల సమయాన్ని ఆదా చేయడానికి, పారదర్శకంగా, అవినీతి రహితంగా సేవలు అందించడానికి స్లాట్ బుకింగ్ విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా అమలు చేస్తున్నామని మంత్రి వివరించారు. ఏప్రిల్ 10 నుంచి ప్రారంభించిన ఈ విధానం జూన్ 2 నాటికి రాష్ట్రంలోని 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమల్లోకి వచ్చిందని, ఇప్పటివరకు దాదాపు మూడు లక్షల స్లాట్ బుకింగ్‌లు నమోదయ్యాయని తెలిపారు. ప్రజల సమయాన్ని ఆదా చేయడమే కాకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం కావడానికి త్వరలో ఈఆధార్ విధానాన్ని కూడా అమలు చేయనున్నామని చెప్పారు. ప్రస్తుతం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్, ఖమ్మం జిల్లా కూసుమంచి కార్యాలయాల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా అమలవుతున్న ఈ విధానాన్ని త్వరలో అన్ని కార్యాలయాలకు విస్తరించనున్నట్లు తెలిపారు.స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖను ప్రభుత్వం ఆదాయ వనరుగా చూడటం లేదని, ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించడమే లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

# పేదల చిరకాల వాంఛ నెరవేరింది


**భద్రాద్రి,ఆగస్టు18(తెలంగాణ ముచ్చట్లు):**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం బెండలపాడు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ మహోత్సవం ఘనంగా జరగనుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగస్టు 21న శ్రావణ మాస శుభ ముహూర్తంలో 27 ఇండ్ల గృహప్రవేశం చేయనున్నారు. ఈ కార్యక్రమం పేదల చిరకాల వాంఛను నెరవేర్చే చారిత్రక ఘట్టంగా నిలవనుందని స్థానికులు అంటున్నారు.బెండలపాడు గ్రామానికి మొత్తం 312 ఇండ్లు మంజూరవ్వగా, 72 ఇండ్లు నిర్మాణం పూర్తయ్యాయి. అందులో 27 ఇండ్లకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా గృహప్రవేశం జరగనుంది. గతంలో భద్రాద్రి రాముని సన్నిధిలో ప్రారంభమైన ఇందిరమ్మ ఇండ్ల పథకం, ఇప్పుడు అదే రాముని ఆశీస్సులతో గృహప్రవేశాల రూపంలో కొనసాగుతుండటం విశేషంగా మారింది.
సోమవారం గృహప్రవేశాలు జరగబోయే ఇండ్లను శాసనసభ్యులు జారే ఆదినారాయణ, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, రామదాస్ నాయక్, మట్ట రాగమయి తదితరులు జిల్లా అధికారులతో కలిసి సందర్శించారు. అనంతరం హెలిపాడ్, సభా ప్రాంగణం ఏర్పాట్లను పరిశీలించి, పోలీస్ బందోబస్తు, వీఐపీల ప్రోటోకాల్, ప్రజా రాకపోకల నియంత్రణపై సమీక్ష సమావేశం నిర్వహించి సూచనలు చేశారు.
లక్ష మందితో జరగనున్న ఈ మహోత్సవం పండగ వాతావరణంలో సాగనుందని నాయకులు తెలిపారు. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పేదవాడి కలలను నిజం చేస్తూ, పునాదులపై భవిష్యత్తు నిలబెట్టే ఈ గృహప్రవేశాలు గ్రామ చరిత్రలో ఒక కొత్త అధ్యాయం రాయనున్నాయి.

# దివంగత నటుడు కోట సతీమణి కోట రుక్మిణి హఠాన్మరణం

(మొదటి పేజీ తరువాయి)



ఈ మేరకు కుటుంబసభ్యులు అధికారికంగా ప్రకటించారు.
ఇలా ఉండగా దివంగత నటుడు కోట శ్రీనివాసరావు(83) జులై 13 ఆదివారం ఉదయం కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. జూబ్లీహిల్స్ మహాప్రస్థానం స్మశానవాటికలో కోట అంత్యక్రియలు జరిగాయి.
1942 జులై 10వ తేదీన కృష్ణా జిల్లా కంకిపాడులో కోట జన్మించారు. 1978లో 'ప్రాణం ఖరీదు' సినిమాతో ఆయన సినిమాల్లో అరంగేట్రం చేశారు. 750కి పైగా సినిమాల్లో కోట శ్రీనివాసరావు నటించారు. నాలుగు దశాబ్దాల సినీ ప్రయాణంలో ఎన్నో విలక్షణ పాత్రలు పోషించారు. తమిళం, హిందీ, కన్నడ, మలయాళంలోనూ నటించారు. ప్రతిఘటన సినిమాతో విలన్‌గా మంచి గుర్తింపు పొందారు. 2015లో కోట శ్రీనివాసరావు పద్మశ్రీ అవార్డు సైతం అందుకున్నారు. కోట 9 నంది అవార్డులు, సైమా అవార్డు అందుకున్నారు. కాగా, ఇప్పుడు కోట భార్య కూడా తనువు చాలించడంతో కుటుంబంలో విషాద ఛాయలు నెలకొన్నాయి.

# అభివృద్ధిని ప్రచారం చేసే బాధ్యత సోషల్ మీడియా వారియర్లదే

- తప్పుడు ప్రచారాలను ఖండిరచి, వాస్తవ పోస్టులను పొందుపరచాలి
- మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి




కోదాడ ఆగస్టు18(తెలంగాణ ముచ్చట్లు):

కాంగ్రెస్ ప్రభుత్వం కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలలో వందల కోట్ల రూపాయలతో చేస్తున్న అభివృద్ధి గురించి విస్తృత ప్రచారం నిర్వహించాల్సిన బాధ్యత సోషల్ మీడియా వారియర్లదేనని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం కోదాడ మేళ్లచెరువు కాశీనాథం ఫంక్షన్ హాల్‌లో రెండు నియోజకవర్గాల సోషల్ మీడియా వారియర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు నియోజకవర్గాలలో దవాఖానలు, రోడ్లు, సాగు నీరు, ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు, ఎత్తిపోతల పథకాలు తదితర అభివృద్ధి పనులపై ఫేస్ బుక్, ట్విట్టర్, ఇన్‌స్టా, వాట్సాప్‌లలో పోస్టులు పొందుపర్చి క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కలిగించే విధంగా సోషల్ మీడియా వారియర్లు కృషి చేయాలన్నారు. నిబద్ధతగా పనిచేసే సోషల్ మీడియా వారియర్లకు సంపూర్ణ గౌరవం, గుర్తింపుతోపాటు తగిన సాయం కూడా చేస్తామని భరోసా ఇచ్చారు. సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా శ్రీధర్ రామస్వామి బాధ్యత వహిస్తారని మంత్రి చెప్పారు. తటస్థ ఓటర్లు సహాయక సంఘాలు, వాట్సాప్ గ్రూపులు, చానళ్లు సృష్టించి వారికి మన పోస్టులు చేరేవిధంగా చూడాలని సూచించారు. అదేవిధంగా తప్పుడు ప్రచారాలను ఖండిరచాలని, వాస్తవ పోస్టులను పొందుపరచాలని తెలిపారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలకు 600 పోలింగ్ బూతులకు సోషల్ మీడియా వారియర్లను ఏర్పాటు చేయాలని అన్నారు. సెప్టెంబర్ 15న తిరిగి సమావేశం నిర్వహిస్తామని, బాధ్యతగా పనిచేసే వారియర్లకు గుర్తింపు కార్డులు, ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు సోషల్ మీడియా వారియర్లు పాల్గొన్నారు.





# హైదరాబాద్ కూకట్‌పల్లిలో దారుణం



హైదరాబాద్,ఆగస్టు 18(తెలంగాణ ముచ్చట్లు):

కూకట్‌పల్లిలో ఘోరం జరిగింది. పన్నెండేళ్ల బాలికను అత్యంత కిరాతకంగా హత్య చేశారు. బాలిక తల్లిదండ్రులు ఆఫీస్‌లకు వెళ్లిన సమయంలో ఒంటరిగా ఉన్న కూతుర్ని అత్యంత పాశవికంగా చంపేసి పరారయ్యారు దుండగులు.

కూకట్‌పల్లి సంగీత్ నగర్‌లో ఈ దారుణం జరిగింది. పేరెంట్స్ ఇంట్లో లేని సమయంలో పన్నెండేళ్ల సహస్రాణిను పొట్టనబెట్టుకున్నారు. హత్య గురించి తెలుసుకున్న స్థానికులు ఘటనా స్థలానికి భారీగా చేరుకున్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు కూకట్‌పల్లి పోలీసులు ఘటనా స్థలానికి హుటాహుటీన చేరుకున్నారు.

పోలీసులు చెబుతున్న వివరాల ప్రకారం.. సహస్ర తల్లిదండ్రులు రేణుక, కృష్ణ ప్రైవేట్ ఉద్యోగులు. కొన్నాళ్లుగా కూకట్‌పల్లిలో నివసిస్తున్నారు. బాలిక తల్లిదండ్రులు ఉద్యోగ నిమిత్తం ఆఫీస్‌కు వెళ్లిన సమయంలో ఈ హత్య జరిగిందని తెలిపారు. కాగా, చిన్నారి మృతి పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విగతజీవిగా ఉన్న తమ చిన్నారిని చూసి గుండెలవిసేలా రోధిస్తున్నారు. ఇంట్లో ఒకవేళ తమ కొడుకు కూడా ఉండి ఉంటే అతన్ని కూడా చంపేసేవారేమోనని చిన్నారి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇలా ఉండగా, బాలిక హత్యకు సంబంధించి చిన్నారి తల్లిదండ్రులు బంధువులపై అనుమానం వ్యక్తం చేస్తున్నట్టు తెలుస్తోంది. బాలికపై ఒక యువకుడు లైంగిక దాడికి యత్నించినట్టు అనుమానిస్తున్నారు. ఎదురు తిరిగిన బాలికను పొడిచి చంపినట్లు సమాచారం. సీసీ పుటేజ్‌లో ఓ యువకుడు ఇంటి నుంచి బయటకి వస్తున్న దృశ్యాల ఆధారంగా పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.



# అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యకు ప్రత్యేక చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతానికి అనేక అంగన్‌వాడీ కేంద్రాలు ఒకే గదిలో నడుస్తుండటంతో ప్రీప్రైమరీ తరగతులను నిర్వహించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యను అధిగమించడానికి జీరో ఎన్రోల్మెంట్ ఉన్న ప్రభుత్వ పాఠశాలలను వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 21 జిల్లాల్లో 61 ప్రభుత్వ పాఠశాలలను గుర్తించారు. అందులో 34 పాఠశాలలు అంగన్‌వాడీ కేంద్రాలకు సమీపంలో ఉండటంతో పైలట్ ప్రాజెక్ట్‌గా వాటిలో అంగన్‌వాడీ కేంద్రాలను తరలించి, పూర్వ ప్రాథమిక విద్యా తరగతులు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ జీ.సృజన జిల్లా అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు. పాఠశాలల ప్రస్తుత పరిస్థితులను తక్షణమే పరిశీలించి, అనుకూలంగా ఉంటే జిల్లా విద్యా అధికారులతో సమన్వయం చేసి భవనాలను అంగన్‌వాడీల కోసం వినియోగించాలని ఆదేశాలు ఇచ్చారు. సెప్టెంబర్ 1లోపు ఈ ప్రక్రియను పూర్తి చేసి తరగతులను ప్రారంభించాల్సిందిగా సూచించారు.




ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, "దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలోనే అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య అందిస్తున్నాం. ప్రైవేటు ప్లే స్కూల్లకు ఏమాత్రం తీసిపోకుండా అంగన్‌వాడీలు పిల్లలకు నాణ్యమైన విద్య, సంరక్షణ అందిస్తున్నాయి. ఇప్పుడు మరో అడుగు ముందుకు వేసి ప్రీప్రైమరీ సామర్థ్యాన్ని పెంచి పిల్లలను ప్రాథమిక విద్యకు సిద్ధం చేస్తున్నాం" అని తెలిపారు. చిన్నారి జీవితంలో ప్రారంభ దశలో ఇచ్చే సరైన సంరక్షణ, విద్య వారికి జీవితాంతం సానుకూల ఫలితాలు ఇస్తాయని అనేక అధ్యయనాలు వెల్లడించాయని మంత్రి గుర్తుచేశారు. అందుకే పూర్వ ప్రాథమిక విద్యను అంగన్‌వాడీల ద్వారా అందిస్తూ ప్రతి చిన్నారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నామని అన్నారు. అంతేకాక, జీరో ఎన్రోల్మెంట్ పాఠశాలలను వినియోగించడం ద్వారా ఈ పథకాన్ని మరింత విస్తరించి రాష్ట్రంలోని ప్రతి చిన్నారికి నాణ్యమైన ప్రారంభ విద్య అందించడం ప్రభుత్వ లక్ష్యమని సీతక్క స్పష్టం చేశారు.

# తన స్వగ్రామంలో అంగన్‌వాడీ, పాలన కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి సీతక్క

- స్వగ్రామంలో చిన్నారుల భవిష్యత్తుకు శంకుస్థాపన చేసిన మంత్రి
- తల్లుల ఉపాధికి భరోసా కల్పించే పాలన కేంద్రాలు
- చిన్నారుల కోసం ఆట వస్తువులు, అవసరమైన సదుపాయాలు ఏర్పాటు
- మూడేళ్ల లోపు పిల్లల సంరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి



ములుగు,ఆగస్టు18(తెలంగాణ ముచ్చట్లు):

ములుగు మండలంలోని తన స్వగ్రామం జగ్గన్నపేటలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అంగన్‌వాడీ, పాలన కేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. అదే గ్రామంలో కొత్త అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది వేశారు.

నూతనంగా ఏర్పాటు చేసిన పాలన కేంద్రంలో చిన్నారుల కోసం అవసరమైన అన్ని రకాల సదుపాయాలు, ఆట వస్తువులు అందుబాటులోకి తెచ్చారు. ప్రత్యేకంగా మూడేళ్లలోపు పిల్లల సంరక్షణ కోసం ఈ కేంద్రాలు పనిచేస్తాయి. పట్టణాల్లోని ప్లే స్కూల్ల తరహాలో పల్లెల్లోని చిన్నారులకు మంచి సంరక్షణ అందించడం, వారి తల్లులకు ఆసరాగా నిలవడం పాలన కేంద్రాల ప్రధాన లక్ష్యం అని మంత్రి వివరించారు.

తల్లులు తమ చిన్నారులను సురక్షితంగా పాలన కేంద్రంలోని సిబ్బందికి అప్పగించి ఆందోళన లేకుండా పనుల కోసం వెళ్లవచ్చు. చిన్నారులను పనిస్థలాలకు తీసుకెళ్లలేక చాలామంది తల్లులు ఉపాధి అవకాశాలను కోల్పోతున్నారని, ఈ సమస్యను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం పాలన కేంద్రాలను ఏర్పాటు చేసిందని మంత్రి పేర్కొన్నారు.

చిన్నారుల సంరక్షణతో పాటు తల్లుల ఉపాధికి భరోసా కల్పించే విధంగా పాలన కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని సీతక్క స్పష్టం చేశారు.

# విద్యార్థినిపై లైంగిక వేధింపులు

(మొదటి పేజీ తరువాయి)

బాధితురాలు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో చదువుతున్న ఒడిస్సాకు చెందిన విద్యార్థినిగా తెలుస్తోంది. అనారోగ్య కారణాలతో చందానగర్‌లోని పీఆర్కే ఆస్పత్రిలో హెచ్‌సీయూ విద్యార్థిని చేరారు. బాధిత విద్యార్థిని ప్రైవేట్ పార్ట్‌లను తాకుతూ ఆస్పత్రిలోని వార్డ్ బాయ్ అసభ్యంగా ప్రవర్తించాడు. చందానగర్ పోలీస్ స్టేషన్‌లో హెచ్‌సీయూ విద్యార్థిని ఫిర్యాదు చేశారు. అయితే, ఈ విషయాన్ని హాస్పిటల్ నిర్వాహకులు, పోలీస్ సిబ్బంది గోప్యంగా ఉంచుతున్నారు. వార్డ్ బాయ్‌ని కఠినంగా శిక్షించాలని హెచ్‌సీయూ విద్యార్థిని డిమాండ్ చేశారు. బాధితురాలికి అండగా ఉండాల్సిన పోలీసులు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు.



# మూడు రోజులు తెలంగాణలో భారీ నుండి అతిభారీ వర్షాలు

హైదరాబాద్,ఆగస్టు 18(తెలంగాణ ముచ్చట్లు):

నిన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతం, దాని సమీపంలోని వాయువ్య బంగాళాఖాతం ప్రాంతంలో ఏర్పడిన అల్పపీడన ప్రాంతం మరింత బలపడి ఈరోజు ఉదయం 05:30 గంటలకు అదే ప్రాంతంలో స్పష్టమైన అల్పపీడన ప్రాంతంగా కొనసాగుతోంది. దీనికి అనుబంధంగా ఉన్న ఉపరితల చక్రవాత ఆవర్తనం సగటు సముద్ర మట్టం నుండి 9.6 కి మీ ఎత్తువరకు కొనసాగుతూ ఎత్తు పెరిగే కొద్దీ నైరుతి దిక్కుకి వాలి ఉంది. ఈ స్పష్టమైన అల్పపీడనం రాగల 12 గంటలలో మరింత బలపడి వాయుగుండంగా మారి అటు పెమ్మట పశ్చిమ వాయువ్యదిశలో కదిలి దక్షిణ ఒడిస్సా, ఉత్తరాంధ్ర తీరాల సమీపంలో ఈనెల 19వ తారీకు మధ్యాహ్నానికి తీరాన్ని దాటే అవకాశం ఉంది. నిన్న విదర్భ దాని పరిసరాలలో కొనసాగిన అల్పపీడన ప్రాంతం ఈరోజు ఉదయం 5:30 గంటలకు బలహీనపడి ఉపరితల ఆవర్తనంగా మారి ఈరోజు ఉదయం 08:30 గంటలకు రుతుపవన ద్రోణిలో విలీనమైంది. ఋతుపవన ద్రోణి ఈరోజు నాలియా, జల్గావ్, బ్రహ్మపురి, జగదల్పూర్, అటు నుండి పశ్చిమ మధ్య మరియు వాయువ్య బంగాళాఖాతం ప్రాంతంలో కొనసాగుతున్న స్పష్టమైన అల్పపీడన ప్రాంత కేంద్రం వరకు సగటు సముద్రమట్టం నుండి 1.5 కి మీ ఎత్తులో కొనసాగుతోంది. తూర్పు పశ్చిమ ద్రోణి ఈరోజు ఈశాన్య అరేబియన్ సముద్ర ప్రాంతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం నుండి దక్షిణ గుజరాత్, విదర్భ ప్రాంతాల్లోని ఉపరితల ఆవర్తనం, ఉత్తర మరాత్వాడ, మీదుగా, మీదుగా పశ్చిమ మధ్య మరియు వాయువ్య బంగాళాఖాతం ప్రాంతంలో ఏర్పడిన అల్పపీడన ప్రాంతం కేంద్రం వరకు సగటు సముద్రం అట్టనుండి 1.5 నుండి 3.1 కి మీ మధ్యలో కొనసాగుతూ ఎత్తు పెరిగే కొద్దీ దక్షిణ దిశకు వాలి ఉంది.

# మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి హైకోర్టు నోటీసులు

- ఓబుళాపురం మైనింగ్ కేసులో నోటీసులు జారీ చేసిన హైకోర్టు
- నిర్దోషులుగా తేల్చుతూ కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేసిన సీబీఐ
- సబితతో పాటు మాజీ ఐఏఎస్ కృపానందకు నోటీసులు జారీ






హైదరాబాద్,ఆగస్టు 18(తెలంగాణ ముచ్చట్లు):

మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకురాలు సబితా ఇంద్రారెడ్డికి తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో సబితా ఇంద్రారెడ్డితో పాటు మాజీ ఐఏఎస్ కృపానందానికి కూడా నోటీసులు జారీ అయ్యాయి. వీరిద్దరిని నిర్దోషులుగా తేల్చుస్తూ నాంపల్లి సీబీఐ కోర్టు గతంలో తీర్పు వెలువరించింది. సీబీఐ ఈ తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ క్రమంలో ఉన్నత న్యాయస్థానం కౌంటర్ దాఖలు చేయాలని వీరిద్దరిని ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది. ఓబుళాపురం మైనింగ్ కేసులో నాంపల్లి సీబీఐ కోర్టు మే నెలలో తుది తీర్పును వెలువరించింది. 15 ఏళ్ల పాటు సుదీర్ఘ విచారణ అనంతరం ఈ కేసులో మొత్తం ఐదుగురిని దోషులుగా, ఇద్దరిని నిర్దోషులుగా ప్రకటించింది. ఈ కేసులో ప్రధాన నిందితులైన గాలి జనార్ధన్ రెడ్డి, బీవీ శ్రీనివాస్ రెడ్డి, మెఫజ్ అలీఖాన్, గనుల శాఖ అప్పటి డైరెక్టర్ వీడీ రాజగోపాల్‌ను దోషులుగా నిర్ధారిస్తూ శిక్షలు ఖరారు చేసింది.

గాలి జనార్ధన్ రెడ్డి సహా నలుగురికి ఏడేళ్ల జైలు శిక్షను ఖరారు చేసింది. దోషులకు రూ. 10 వేల చొప్పున జరిమానా కూడా విధించింది. అలాగే ఓబుళాపురం మైనింగ్ కంపెనీకి రూ. 2 లక్షల జరిమానా విధించింది. ఈ కేసులో, అప్పటి గనుల శాఖ మంత్రిగా ఉన్న సబితా ఇంద్రా రెడ్డికి, నాటి పరిశ్రమల శాఖ కార్యదర్శి కృపానందకు సీబీఐ కోర్టులో ఊరట లభించింది. వారిని నిర్దోషులుగా ప్రకటించడంతో సీబీఐ హైకోర్టుకు వెళ్లింది.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : పొట్లిపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



## ఈ నెల 21నా బెండాలపాడు గ్రామంకు సీఎం రేవంత్.!

సత్తుపల్లి, ఆగస్టు18(తెలంగాణ ముచ్చట్లు):



ఈ నెల 21వ తేదీన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చంద్రుగొండ మండలం, బెండాలపాడు గ్రామం లో ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథి గా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విచ్చేస్తున్న సందర్భంగా, సోమవారం జిల్లా అధికారుల తో రివ్యూ మీటింగ్ లో పాల్గొన్న రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎమ్మెల్యేలు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మరియు జిల్లా అధికారులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.




## సెప్టెంబర్ 1 పెన్షన్ విద్రోహదినం మహా ధర్నా పోస్టర్ ఆవిష్కరణ

- **సీపీఎస్ రద్దు కోసం ఉపాధ్యాయ సంఘాల దీర్ఘకాల పోరాటం**
- **"సీపీఎస్ అంతం – పీఆర్టీయూ పంతం" నినాదంతో మహా ధర్నా పిలుపు**
- **ఇందిరా పార్క్ వద్ద భారీ స్థాయిలో విజయవంతం చేయాలని పీఆర్టీయూ పిలుపు**

ధర్మసాగర్,ఆగస్టు18(తెలంగాణ ముచ్చట్లు):

పీఆర్టీయూ టీఎస్ ధర్మసాగర్ మండలశాఖ ఆధ్వర్యంలో పెన్షన్ విద్రోహదినం సందర్భంగా చేపట్టబోయే మహా ధర్నా పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ధర్మసాగర్ హైస్కూల్ బాలుర పాఠశాలలో జరిగింది.ఈ సందర్భంగా మండలశాఖ అధ్యక్షులు అనిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, 2004 సెప్టెంబర్ 1 నుండి పాత పెన్షన్ విధానాన్ని రద్దు చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంను అమలు చేస్తున్నాయని తెలిపారు. అప్పటి నుండి ఉపాధ్యాయ సంఘాలు సీపీఎస్ రద్దు కోరుతూ పలు దశల్లో నిరసనలు చేపట్టినా, ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆయన విమర్శించారు.

ఉద్యోగులు, ఉపాధ్యాయులు అనివార్య పరిస్థితుల్లో పోరుబాట పట్టిన నేపథ్యంలో "సీపీఎస్ అంతం - పీఆర్టీయూ పంతం" అనే నినాదంతో సెప్టెంబర్ 1న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా నిర్వహించనున్నట్టు ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యంగా సీపీఎస్ ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై మహా ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొని ఐక్యంగా దీన్ని విజయవంతం చేశారు.




### సామాజిక సమానత్వం కోసం పోరాడిన యోధుడు

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

- **చిలుకనగర్‌లో ఘనంగా నిర్వహించిన జయంతి వేడుకలు**
- **విగ్రహానికి పూలమాలలు అర్పించిన కార్పొరేటర్ గీత ప్రవీణ్**
- **బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన యోధుడు పాపన్న**

చిలుకనగర్, ఆగస్టు 18 (తెలంగాణ ముచ్చట్లు):

ఉప్పల్ నియోజకవర్గం చిలుకనగర్ డివిజన్‌లోని నోవా బంకెట్ హాల్ వద్ద సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిలుకనగర్ డివిజన్ కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా గీత ప్రవీణ్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం, సామాజిక సమానత్వం కోసం, రాజకీయ న్యాయం కోసం పోరాడిన యోధుడు అని పేర్కొన్నారు. ఆయన జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని అన్నారు.

జయంతి వేడుకల్లో సర్దార్ సర్వాయి పాపన్న కమిటీ సభ్యులు నేర్థం భాస్కర్ గౌడ్, గజ్జల సత్యరాజ్ గౌడ్, భూత్కూరి నవీన్ గౌడ్ పాల్గొన్నారు. అదేవిధంగా బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు ఎదుల కొండల్ రెడ్డి, కోకొండ జగన్, రామాంజనేయులు, శ్యామ్ తదితరులు కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. పాపన్న గౌడ్ ఆత్మస్ఫూర్తిని నేటి తరాలు తెలుసుకుని ఆయన చూపిన మార్గంలో నడవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు.

# పోలీస్ నిబంధనలు పాటిస్తూ గణేష్ నవరాత్రులు జరుపుకుందాం

- **పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**

వరంగల్,ఆగస్టు18(తెలంగాణ ముచ్చట్లు):




రాబోయే వినాయక చవితి సందర్భంగా ట్రైసిటీ పరిధిలో ఏర్పాటు చేయబోయే గణేష్ మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల సూచనలు పాటించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సూచించారు. గణేష్ ప్రతిమల ఎత్తు, ఏర్పాటు చేసే ప్రదేశం, నిమజ్జనం తేదీ, ప్రదేశం వంటి పూర్తి వివరాలను పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీస్ ప్రోటోకాల్ వెబ్ సైట్ లో నమోదు చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అనంతరం సంబంధిత స్టేషన్ అధికారులు ఆన్లైన్ ద్వారా అనుమతులు జారీ చేస్తారని తెలిపారు.

మండపాల ఏర్పాటు ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించకుండా ఉండాలని, స్థల యజమాని లేదా సంబంధిత శాఖల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. విద్యుత్ కనెక్షన్లు అధికార అనుమతులతోనే తీసుకోవాలి. షార్ట్ సర్క్యూట్ సమస్యలు రాకుండా నాణ్యమైన వైరును వాడాలని, మండపాలలో బాధ్యుల వివరాలు, కమిటీ సభ్యుల ఫోన్ నంబర్లు ఉన్న ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వృద్ధులు, విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా తక్కువ శబ్ద కాలుష్యంతో స్పీకర్లు వాడాలని, సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు రాత్రి 10 గంటల వరకు మాత్రమే వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. మండపాల్లో డీజే వాడకాన్ని పూర్తిగా నిషేధించారు.

అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యగా రెండు బకెట్ల నీళ్లు, ఇసుక తప్పనిసరిగా ఉంచాలని కమిషనర్ సూచించారు. మద్యం సేవించడం, పేకాట, లక్కీ డ్రాలు, అసభ్యకర నృత్యాలు, ఇతర మతాలను కించపరిచే ప్రసంగాలు, పాటలు కఠినంగా నిషేధమని పేర్కొన్నారు. మండపాల్లో 24 గంటలు వాలంటీర్లు ఉండేలా చూడాలని, భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని క్యూలైన్లను ఏర్పాటు చేయాలని సూచించారు.

మండపాల్లో ఏదైనా అనుమానాస్పద వస్తువులు కనిపించిన వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కమిషనర్ ఆదేశించారు. పోలీసుల తనిఖీల కోసం పాయింట్ పుస్తకం తప్పనిసరిగా ఉంచుకోవాలని, అధికారులు పరిశీలించి అందులో సంతకం చేస్తారని తెలిపారు. అన్ని నిర్వాహకులు భక్తి శ్రద్ధలతో పాటు నిబంధనలు పాటించి గణేష్ నవరాత్రులను శాంతియుతంగా, విజయవంతంగా జరుపుకోవాలని కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ పిలుపునిచ్చారు.

# గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా పాపన్న 375 జయంతి

వనపర్తి, ఆగస్టు 18 (తెలంగాణ ముచ్చట్లు):




సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375 వ జయంతిని గౌడ సంఘం ఆధ్వర్యంలో వనపర్తి రాజు చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలుస శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. పల్లెను కొడితే ఏమి పలం? ఊరును కోడితే ఏమి ఫలము? కొడితే గోల్కొండ కోటను కొట్టాలి అని దక్కన్ సామ్రాజ్యాన్ని స్థాపించిన తెలంగాణ బహుజన విప్లవ వీరుడు తొలి పోరాట యోధుడు తెలంగాణ ఆకాంక్షలు 375 ఏళ్ల క్రితమే ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప పోరాట యోధుడు స్ఫూర్తి ప్రదాత శ్రీ శ్రీ శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ తల్లి పేరును ముందుగా పెట్టుకొని మీరు 20 కోటలను జయించి 30 ఏళ్లుగా పరిపాలించిన గొప్ప పోరాటం

శత్రుదుర్భేదమైన బలమైన సైన్యం కలిగిన మొఘల్ సామ్రాజ రాజు ఔరంగాజేబ్ హింసాత్మకమైన కఠినమైన చర్యలతో ప్రజలను బానిసలుగా చేసి పీడిస్తున్న మొగల సామ్రాజ్యంపై దండయాత్ర చేసి తెలంగాణ ప్రజలకు ఆనాడే స్వేచ్ఛ వాయువులు పిలిచే విధంగా పోరు విత్తనాలు జల్లి గోల్కొండ కోటని ఏలిన గొప్ప యోధుడుబహుజన చక్రవర్తి శ్రీశ్రీశ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కొనియాడారు.బీసీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చెన్న రాములు మాట్లాడుతూ.. ఔరంగజేబుకు తెలంగాణ దెబ్బ రుచి చూయించిన తెలంగాణ సాయుధ పోరాట యోధుడు బహుజన రాజ్యాధికారం కోసం పోరాడిన ,దీశాలి దొరల అరాచకాలను మొగులాయి దౌర్జన్యాలను ఎదురించి తెలంగాణ ప్రాంతాన్ని కాపాడిన వీరుడు.ఏడు నెలలు గోల్కొండ ను ఏలినచేసిన మొనగాడు కొనియాడారు.మాజీ మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్ మాట్లాడుతూ.. పాపన్న అందరివాడు సమ సమాజ స్థాపన కోసం పోరాడిన వాడు 12 మందితో సైన్యం ఏర్పర్చి 12 వేల మందితో గేరీల పోరాటం చేసిన గొప్ప యోధుడు అని పాపన్న మొగల్ సైనికులు కల్లు తాగి డబ్బులు ఇవ్వకపోతే సైనికులపై ఎదురుగా ఎదుర్కొన్న గొప్ప వీరుడు ఆనాటి నుండి బహుజనుల కోసం పోరాటం చేసి ఉన్నవాళ్ల దగ్గర డబ్బు భూములు తీసుకొని లేని వాళ్లకు పంచడం జరిగినది అని చెప్పారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ మాట్లాడుతూ.. 375 ఏళ్ల క్రితం పోరాడిన పాపన్న ఎంతో చరిత్ర చెప్పుకోవాల్సిన అవసరం ఉంది ,,,పాపన్నని స్ఫూర్తిగా తీసుకొని అందరం ముందుకు సాగాలి సర్దార్ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గోల్కొండ కోటని. ఏలి సామాన్యుడు కూడా రాజ్యాధికారం సాధించవచ్చని నిరూపించాడు. పాపన్న గొప్ప యోధుడు అని చెప్పరు తెలంగాణ రాబిన్ ఫుడ్ గా అభిమానించారు , పాపన్న పై చరిత్రపై అధ్యయనాలు పుస్తకాలు రచించబడ్డాయి రచయిత బార్బరా మరియు మెటకల్ఫ్ రిచర్డ ఈ టన్ చరిత్రకారులు పుస్తకాలు రచించారు బహుజన రాజాధికారం,, ఎలాంటి టెక్నాలజీ సమయంలో పాపన్న సైన్యాన్ని కూడగట్టి గెరిల్లా దండయాత్ర చేసి ఔరంగాజేబు సామ్రాజ్యాన్ని నెల మట్టం చేసి దాదాపు 8 నెలలు గోల్కొండ కోటను. ఏలినారు ,30 రాయదుర్గాలను కోటల ను నిర్మించిన గొప్ప విప్లవ యోధుడు. తెలంగాణ చత్రపతి అని కొనియాడారు.వనపర్తి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చీర్ల చందర్* మాట్లాడుతూ గౌడ జాతికి ఎల్లవేళల మా యొక్క సాహసం ఆకారం ఉంటాయని ,,సర్దార్ సర్వాయి పాపన్న ఆదర్శమని చెప్పారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# యువత స్వయం ఉపాధితో ఎదగాలి

- **గ్రామీణ ప్రాంతాల్లో రోగులకు ఆర్ఎంపీల పాత్ర కీలకం**
- **నూతన శ్రీ రామ మెడికల్ జనరల్ స్టోర్ ప్రారంభోత్సవం**
- **వెల్టూర్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి**

వనపర్తి,ఆగస్టు 18( తెలంగాణ ముచ్చట్లు):

యువత స్వయం ఉపాధిని ఎంచుకొని ఎదగాలని పెద్దమందడి మండలం వెల్టూర్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం వెల్టూర్ గ్రామంలోని నూతన శ్రీ రామ మెడికల్ జనరల్ స్టోర్ తో పాటు ఆర్ఎంపీ డాక్టర్ మల్లేష్ నిర్వహిస్తున్న క్లినిక్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అందుబాటులో ఉంటూ... రోగుల పరిరక్షణలో ఆర్.ఎం.పి డాక్టర్ల పాత్ర కీలకమని వెల్టూర్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రాథమిక చికిత్సకు గ్రామంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణలో డాక్టర్ మల్లేష్ అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించడం పట్ల డాక్టర్ మల్లేష్ ను అభినందించారు. రోగులకు మరింత అందుబాటులో ఉండి ప్రాథమిక చికిత్స అందించాలని డాక్టర్ మల్లేష్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి రఘుపతి రెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు బాబురెడ్డి, చిత్తూరు కృష్ణారెడ్డి, దయ్యాల హేమంత్, రఘువర్ధన్ రెడ్డి, దయ్యాల రమేష్, రుక్మద్దీన్, కుమ్మరి కొండన్న, కావలి వెంకటయ్య, సుద్దబాయి రాజు, చందు రెడ్డి, పట్నం సత్తన్న,కానా మన్నెం, డాక్టర్ మల్లేష్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఒకపక్క కలకల...మరోపక్క వెలవెల..

**వృధాగా పోతున్న వర్షపు నీరు**

వనపర్తి, ఆగస్టు18 (తెలంగాణ ముచ్చట్లు):

దేవుడు కరుణించిన పూజారి వరమీయనట్లుగా పెద్దమందడి మండలం అమ్మపల్లి తిమ్మరాయి చెరువు, అమ్మ చెరువు రైతుల పాలిట శాపంగా మారింది, చెరువులు చిన్నపాటి మరమ్మతులకు నోచుకోకపోవడంతో చెరువులోకి వచ్చిన వర్షపు నీరు తుమ్మల నుండి వృధాగా పోతున్నాడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు, దేవుడు కరుణించిన పూజారి వరమియ్యనట్లుగా మా పాలిట శాపంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, ఓ పక్క చెరువు నుండి రైతులు పంటలు చేసుకు సాగు చేసుకుంటే, తిమ్మరాయి చెరువులోకి నీళ్లు వచ్చి చెరువు ఖాళీ కావడంతో సాగు భూములు ఎడారిగా మార్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని మూగజీవాలకు సైతం తాగునీటి ఎద్దటి ఏర్పడుతుందని ఆందోళన చేస్తున్నారు, అదేవిధంగా అమ్మ చెరువు తూము నుండి నీరు పోకుండా మట్టితో మూసేశారు, దీంతో పంటలు సాగు చేసుకోవడానికి సాగునీరు రాని పరిస్థితి ఏర్పడ్డది,అధికారులకు ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోవడంలో నిర్లక్ష్యంగా వివరించడంతో మా పాలిట శాపంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు,







# డబుల్ బెడ్ రూమ్ ప్రాంతంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని రిలే నిరాహార దీక్షలు

- అహ్మాద్ గూడా 2బిఎచ్‌కే ప్రాంతంలో అవస్థలు ఎదుర్కొంటున్న ప్రజలు
- సిఐటియు నేతృత్వంలో ప్రారంభమైన నిరాహార దీక్షలు
- సౌకర్యాలు మెరుగుపరచాలని, అసంపూర్తి పనులు పూర్తి చేయాలని డిమాండ్
- ఈ నెల 25న కలెక్టర్ కార్యాలయ ముట్టడి హెచ్చరిక

**కీసర,ఆగస్టు18(తెలంగాణ ముచ్చట్లు):**

మేడ్చల్ నియోజకవర్గంలోని దమ్మాయిగూడ మున్సిపాలిటీ, కీసర మండల పరిధిలోని అహ్మద్ గూడా డబుల్ బెడ్ రూమ్ ప్రాంతంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ స్థానికులు రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ దీక్షలకు సిఐటియు కీసర మండల నాయకులు బంగారు నర్సింగరావు అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా ఫేస్ వన్ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ అహ్మద్ గూడా 2బిఎచ్‌కే ప్రాంతంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జనరేటర్లు ఏర్పాటు చేయడం, లీకేజీలను నివారించే మరమ్మత్తులు చేయడం, అవసరమైన సౌకర్యాలను కల్పించడం కోసం ఎన్నోసార్లు అధికారులను కోరినా స్పందన రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

దీక్షకు ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయకుడు డీజే నరసింహారావు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎన్నికల ప్రయోజనాల కోసం తొందరపడి ఇళ్ల పంపిణీ చేపట్టిందని, కానీ మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రస్తుత ప్రభుత్వం ఎంక్వైరీ కమిటీ ఏర్పాటు చేసి తగిన బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు.

అలాగే సిపిఎం జిల్లా కార్యదర్శి పి. సత్యం మాట్లాడుతూ 2బిఎచ్‌కే పరిసరాల్లో సీసీ కెమెరాలు, రహదారులు, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. అసంపూర్తిగా వదిలేసిన పనులను సంస్థ ఖర్చుతో పూర్తి చేయాలని అన్నారు. డిమాండ్లు నెరవేర్చకపోతే ఈ నెల 25న కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం, కేవీపీఎస్ నాయకులు, అహ్మద్ గూడా ఫేస్ వన్ కమిటీ సభ్యులు, స్థానిక మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వాన్ని న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరారు.



# వెల్టూర్ చెరువు నిండడంతో రైతుల ఆనందం

**వనపర్తి, ఆగస్టు18 (తెలంగాణ ముచ్చట్లు):**

భారీ వర్షాలకు పెద్దమందడి మండలం వెల్టూరు చెరువు పూర్తిస్థాయిలో నిండి అలుగు పారుతుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ఉదయం చెరువు నిండి అలుగు పారుతుండడంతో ఉప్పరి రామచంద్రయ్య అనే రైతు చెరువు సందర్శించి... ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు రామచంద్రయ్య మాట్లాడుతూ... రైతులు వెంటనే వ్యవసాయ పనుల ప్రారంభించి.. గత ఏడాది కంటే అధికంగా వరి పంటలు పండించాలని అన్నారు. యాసంగి పంటకు సరిపడే సాగునీరు పుష్కలంగా ఉన్నదని, రైతులు కాలువల పూడికతీతలు ప్రారంభించుకోవాలని అన్నారు. గ్రామంలో ఉన్న చెరువు పూర్తిస్థాయిలో నిండడంతో రామచంద్రయ్య తెలంగాణ ముచ్చట్ల దినపత్రికతో ముచ్చటిస్తూ తన ఆనందాన్ని పంచుకున్నారు.

# చిలకనగర్‌లో అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవ ప్రత్యేక పూజలు

**చిలకనగర్,ఆగస్టు18(తెలంగాణ ముచ్చట్లు):**

చిలకనగర్ డివిజన్‌లోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో వార్షికోత్సవ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల్లో ముఖ్య అతిథులుగా పాల్గొన్న చిలకనగర్ డివిజన్ కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ ఆలయ మహిమను వివరించారు.

ఆమె మాట్లాడుతూ ఎన్జిఆర్ఐలోని అభయాంజనేయ స్వామి ఆలయం ప్రఖ్యాతి గాంచిందని, ఇక్కడ భక్తులు కోరుకున్న కోరికలు అన్నీ నెరవేరుతాయని పేర్కొన్నారు. స్వామివారి ఆశీస్సులు ఉప్పల్ నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కె. వెంకన్న, ఆలయ చైర్మన్ దిక్కుమల్ల అంజయ్య గుప్తా, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, నాయకులు కోండా జగన్ రామాంజనేయులు, శ్యామ్, దాత సంతోష్ కుమార్ నంద, వేణుగోపాల్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్, అర్చకులు గంభీరపురం రవీంద్ర శర్మ, సంతోష్, మాజీ చైర్మన్లు లక్ష్మీ నారాయణ, నాగయ్య, అంజయ్య, వెంకట్ రెడ్డి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.





# సర్దార్ సర్వాయి పాపన్న 375వ జయంతి సందర్భంగా బహుజన కవి సమ్మేళనం

**జనగామ,ఆగస్టు18(తెలంగాణ ముచ్చట్లు):**

సర్దార్ సర్వాయి పాపన్న 375వ జయంతి సందర్భంగా జనగామ జిల్లా కేంద్రంలో తెలంగాణ గౌడ రచయితల సంఘం ఆధ్వర్యంలో బహుజన కవి సమ్మేళనం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం మనోజ్ కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తరువాత ప్రారంభమైన కవి సమ్మేళనంలో కవులు తమ కవితలను వినిపించారు. ముఖ్య అతిథిగా హాజరైన కవులు కళాకారుల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ జి. కృష్ణ, సర్దార్ సర్వాయి పాపన్న జీవితం, ఆయన చేసిన పోరాటం, నిర్మించిన కట్టడాల ప్రాధాన్యతపై ప్రసంగించారు.ఈ సందర్భంగా లగిశెట్టి ప్రభాకర్, పెట్లోజు సోమేశ్వరా చారి, అయిలా సోమ నరసింహచారి, మాన్యపు భుజేందర్, పొట్టబత్తిని భాస్కర్, చిలుమోజు సాయికిరణ్, అంకాల సోమయ్య, తాళ్లపల్లి లక్ష్మణ్ గౌడ్, డాక్టర్ వేముల సదానందం, రంగరాజు ప్రసాద్ తదితరులు పాల్గొని తమ సాహిత్యాన్ని ప్రదర్శించారు.

# ఎడతెరుపు లేని వర్షాల వల్ల పాఠశాల విద్యార్థులకు ఇబ్బందులు

- అధికారులు తక్షణమే స్పందించాలి
- నక్క కృష్ణ యాదవ్ ఆర్టిఐ మండల అధ్యక్షుడు పెద్దమందడి

**పెద్దమందడి,ఆగస్టు18(తెలంగాణ ముచ్చట్లు):**



వనపర్తి జిల్లాలో ఎడతెరుపు లేని వర్షాలు ప్రజల జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి అని పెద్దమందడి మండల ఆర్టిఐ మండల అధ్యక్షుడు నక్క కృష్ణ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...

ముఖ్యంగా విద్యార్థులు ఆరోగ్య పరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రభుత్వ, మరియు ప్రైవేట్ పాఠశాలలు కొనసాగించబడుతున్నప్పటికీ, తడిగా ఉన్న వాతావరణం చిన్నారులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలో ఆర్టీఐ ,అఖిల పక్ష ఐక్యవేదిక పెద్దమందడి మండల అధ్యక్షుడు నక్క కృష్ణ యాదవ్ స్పందిస్తూ, వర్షాల కారణంగా విద్యార్థులు జలుబు, దగ్గు, జ్వరాలతో బాధపడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి తేమతో కూడిన వాతావరణంలో పాఠశాలలు నిర్వహించడం బాలబుద్ధిని శారీరకంగా, మానసికంగా, దెబ్బతీసే ప్రమాదం ఉందన్నారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పాఠశాల యాజమాన్యాలకు ప్రభుత్వాలు తగిన మార్గదర్శకాలను జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

పాఠశాల భవనాలు, హాస్టల్ నిర్మాణాలు భద్రతా పరంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని సూచించారు.ప్రజలకు ఎప్పటికప్పుడు సహాయం అందించేలా అధికారులు ఫీల్డ్ లో ఉండేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మండలం లో డ్రైనేజ్ మాన్‌హోల్స్‌పై ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని, చెరువుల కట్టల వద్ద ప్రజలు చేపల వేటకు వెళ్లకుండా అప్రమత్తం చేయాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యుల పర్యవేక్షణ పెంచి, మెడిసిన్ సదుపాయాలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ తరహా చొరవలు తీసుకుంటేనే విద్యార్థుల ఆరోగ్య భద్రతను కాపాడటం సాధ్యమవుతుందని నక్క కృష్ణ యాదవ్ పేర్కొన్నారు.



# ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375వ జయంతి వేడుకలు

**చర్లపల్లి,ఆగస్టు18(తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గం చర్లపల్లి డివిజన్‌లో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో చక్రిపురం చౌరస్తా వద్ద సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో చర్లపల్లి డివిజన్ భారతీయ జనతా పార్టీ నాయకులు టి ఆనంద్ గౌడ్, ఎం లక్ష్మణ్ గౌడ్, డి నాదం, చల్లా ప్రభాకర్, ఎం లక్ష్మీనారాయణ గౌడ్, సహదేవ్ గౌడ్ హరినాయక్, ఎస్ అశోక్, బోల్ల శ్రీనివాస్, కే విద్యాసాగర్, రత్నపురం వెంకటేష్, చక్రిపురం కాలనీ అధ్యక్షులు పాండు ముదిరాజ్, అప్పి నయీతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

నాయకులు ఈ సందర్భంగా మాట్లాడుతూ పాపన్న గౌడ్ జీవితమే సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం సాగించిన పోరాటానికి నిదర్శనం అని పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గంలో నడిస్తే సమానత్వం, న్యాయం నెలకొంటుందని అభిప్రాయపడ్డారు.



# బస్తీలో సమస్యల పరిష్కారానికి కార్పొరేటర్ శాంతి సాయిజెన్ పాదయాత్ర

**నాచారం,ఆగస్టు18(తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గం నాచారం డివిజన్‌లోని శ్రీరామ్‌నగర్ ఎరుకల బస్తిలో కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ అధికారులు, స్థానిక ప్రజలతో కలిసి పాదయాత్ర నిర్వహించారు.ఈ సందర్భంగా భూగర్భ డ్రైనేజీ, రహదారుల సమస్యలను సమీక్షించారు. ఇప్పటికే కొంతవరకు పూర్తయిన పనులను పరిశీలించి, ఇంకా అవసరమైన సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలను గుర్తించారు. వీటి కోసం తక్షణమే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు కార్పొరేటర్ ఆదేశాలు ఇచ్చారు. డివిజన్‌లోని అన్ని కాలనీల్లో, ముఖ్యంగా శ్రీరామ్‌నగర్ మరియు ఎరుకల బస్తిలో రహదారులు, డ్రైనేజీలు త్వరలోనే నిర్మించబడతాయని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ సిరాజుద్దీన్, ఎఈ వినీత్ విజయ్ కుమార్, శివ, స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కీసరలో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375వ జయంతి వేడుకలు

**కీసర,ఆగస్టు18(తెలంగాణ ముచ్చట్లు):**

కీసర మండలం చీర్యాల గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం రోజు వనందాస్ లక్ష్మీనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ బహుజన ధీరత్వానికి ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని, పీడిత జనుల కోసం, బహుజనుల ఆత్మగౌరవం కోసం తన సర్వస్వాన్ని అర్పించిన మహాయోధుడు అని కొనియాడారు. నిరంకుశ పాలనకు ఎదురొడ్డి అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన పాపన్న గౌడ్ తెలంగాణ నేలలో పుట్టడం గర్వకారణమని తెలిపారు.

అలాగే సామాజిక, రాజకీయ సమానత కోసం ఆయన చేసిన పోరాటం భావితరాలకు మార్గదర్శకమని, పాపన్న గౌడ్ వీరత్వం తరతరాలకు స్ఫూర్తినిచ్చేలా కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ గౌడ సంఘం సభ్యులు, రాజకీయ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## జియోలో రూ.189 చౌకైన ప్లాన్.. డేటా, అన్‌లిమిటెడ్ కాల్స్, వ్యాలిడిటీ ఎంతో తెలుసా?

లయన్స్ జియో తన ప్రీపెయిడ్ పోర్ట్‌ఫోలియోకు కొత్త, చాలా సరసమైన ప్లాన్‌ను జోడిరచింది. బడ్జెట్ వినియోగదారులను దృష్టిలో ఉంచుకుని ఈ ప్లాన్ ప్రారంభించింది. రూ. 189 ధర గల ఈ ప్లాన్‌లో కస్టమర్‌లు అపరిమిత కాలింగ్, 2G హై స్పీడ్ డేటా, 300 ఉచిత లను 28 రోజుల పాటు పొందుతారు. తక్కువ ధరతో నెల మొత్తం తమ ఫోన్‌ను యాక్టివ్‌గా ఉంచుకోవాలనుకునే వారికి ఈ ప్లాన్ ఉత్తమమైనది. జియో ఈ ప్లాన్ కాలింగ్, తక్కువ డేటాను ఉపయోగించే వారికి మాత్రమే కాకుండా కంటెంట్‌ను ఇష్టపడే వారికి కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. ఇది జియో టీవీ, జియో క్లౌడ్‌లకు ఉచిత యాక్సెస్‌ను అందిస్తుంది. ఇది ఎంటర్టైన్‌మెంట్, డిజిటల్ స్టోరేజీ అవసరాలను కూడా తీరుస్తుంది. ఈ వాల్యూ ప్యాక్ ప్రత్యేకంగా సెకండరీ సిమ్ ఉన్న లేదా తక్కువ ఇంటర్నెట్‌ను ఉపయోగించే కస్టమర్ల కోసం రూపొందించినట్లు కంపెనీ చెబుతోంది. ఈ ప్లాన్ వినియోగదారులకు రూ.189కి మాత్రమే అందుబాటులో ఉంది. రూ.189, మీరు 28 రోజుల అపరిమిత కాలింగ్, డేటా, ఉచితలను పొందుతున్నారు.

# తగ్గిన బంగారం, వెండి ధరలు..



దేశంలో గత కొన్ని రోజులుగా బంగారం, వెండి ధరలు హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి. అయినప్పటికీ 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర లక్ష రూపాయలకుపైగా (%స్త్రశీస aఅస ంఅశ్రీజవతీ జూతీఅషవ సతీశీజూ Aబస్త్రబర 18ర్ష్ట్ర% 2025) ఉంది. ఈ క్రమంలో ఆగస్ట్ 18, 2025న ఉదయం 6.30 గంటల నాటికి గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, దేశ రాజధాని ఢల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ. 1,01,170కి చేరగా, 22 క్యారెట్ల బంగారం ధర రూ. 92,740 స్థాయిలో ఉంది. నిన్నటి ధరలతో పోలిస్తే బంగారం ధరలు స్వల్పంగా రూ. 10 తగ్గాయి. అదే సమయంలో వెండి ధర కిలోకు రూ.100 తగ్గి, రూ. 1,16,100 వద్ద ఉంది. అయితే, ఇతర ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయనేది ఇక్కడ తెలుసుకుందాం.

ఇతర నగరాల్లో బంగారం, వెండి ధరలు

మరోవైపు హైదరాబాద్, విజయవాడ, చెన్నైలలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,01,170గా ఉండగా, 22 క్యారెట్ల గోల్డ్ రేటు రూ. 92,740గా ఉంది. వెండి ధర కిలో గ్రాముకు రూ. 1,26,100గా నమోదైంది. ఇది ఢల్లీలో (రూ. 1,16,100) కంటే అధికం. ముంబై, బెంగళూరు, కోల్‌కతా, పాట్నాలలో 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1,01,170, 22 క్యారెట్ల బంగారం రూ. 92,940గా ఉంది. వెండి ధర రూ. 1,16,900 వద్ద ఉంది. ఈ ధరల వ్యత్యాసాలకు స్థానిక పన్నులు, రవాణా ఖర్చులు, డిమాండ్ వంటి అంశాలు కారణమని నిపుణులు చెబుతున్నారు.

ధరల తగ్గుదలకు కారణాలు

బంగారం, వెండి ధరల తగ్గుదలకు అనేక అంతర్జాతీయ, దేశీయ కారణాలు ఉన్నాయి. ప్రధానంగా అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్ బలపడటం వల్ల బంగారం ధరలపై ఒత్తిడి పెరిగింది. డాలర్ బలంగా ఉన్నప్పుడు, బంగారం కొనుగోలు ఖర్చు ఎక్కువ అవుతుంది. దీనివల్ల డిమాండ్ తగ్గుతుంది. ఫలితంగా, బంగారం ధరలు తగ్గుముఖం పడతాయి. ఇటీవలి కాలంలో బంగారం ధరలు గణనీయంగా పెరిగాయి. దీని వల్ల పెట్టుబడిదారులు తమ లాభాలను కాపాడుకోవడానికి బంగారం అమ్మకాలవైపు మొగ్గు చూపారు. ఈ అమ్మకాల ఒత్తిడి ధరల తగ్గుదలకు దారితీసింది. ఇదే సమయంలో వెండి ధరలు కూడా క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి.

# స్టాక్ మార్కెట్‌లో గర్జన..



సోమవారం భారత స్టాక్ మార్కెట్ ఉత్సాహంగా దూసుకెళ్తుంది. సెన్సెక్స్, నిఫ్టీ రెండూ భారీ లాభాలతో కొనసాగుతున్నాయి. రష్యా నుంచి ఆయిల్ సరఫరా ఆందోళనలు తగ్గడం, అలాగే న్యూ ఢిల్లీలో ప్రతిపాదిత జీఎస్టీ సంస్కరణలపై ఆశావాదం ఈ ర్యాలీకి ఊపునిచ్చాయి. దీంతో ఈ ఉదయం మార్కెట్ ఓపెన్ అయిన కాసేపటికే సెన్సెక్స్ 304 పాయింట్లు (0.38%) ఎగసి 80,565 వద్ద, నిఫ్టీ 50 రాకెట్‌లా 132 పాయింట్లు (0.54%) పెరిగి 24,619 ఇంకా పాజిటివ్ దిశగా కొనసాగుతున్నాయి.

ఈ క్రమంలోనే ఉదయం 9.38 గంటల నాటికి సెన్సెక్స్ 1095 పాయింట్లు లాభపడగా, నిఫ్టీ 355, బ్యాంక్ నిఫ్టీ 711, నిఫ్టీ మిడ్ క్యాప్ 100 ఇండెక్స్ 630 పాయింట్లు లాభపడ్డాయి. దీంతో మదుపర్లు కొన్ని నిమిషాల వ్యవధిలోనే లక్షల కోట్ల రూపాయలను దక్కించుకున్నారు.

**సెక్టార్లలో హవా**

సెక్టోరియల్ ఇండెక్స్‌ల విషయానికొస్తే, ఫార్మా, హెల్త్‌కేర్ సెక్టార్లు మినహా మిగతా అన్ని గ్రీన్ జోన్‌లో ట్రేడ్ అవుతున్నాయి. ఆటో స్టాక్స్ 1.1% లాభంతో దూసుకెళ్లగా, ఫైనాన్షియల్ స్టాక్స్ 0.4% పెరిగాయి. బ్రాడర్ మార్కెట్‌లో నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 1.02%, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.85% లాభపడ్డాయి. ఈ లాభాలు చూస్తే చిన్న, మధ్య తరగతి కంపెనీలు కూడా మంచి జోష్‌లో ఉన్నాయని అర్థమవుతోంది. సెన్సెక్స్‌లో లార్సెన్ అండ్ టుబ్రో, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్, సన్ ఫార్మా మినహా దాదాపు అన్ని స్టాక్స్ గ్రీన్‌లోనే ట్రేడ్ అవుతున్నాయి.

**అప్‌గ్రేడ్ గుడ్ న్యూస్**

భారత ఆర్థిక వ్యవస్థ విషయంలో ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ భారత్‌కు లాంగ్ టర్మ్ సావరిన్ క్రెడిట్ రేటింగ్‌ను BBB నుంచి BBBకి, షార్ట్‌టర్మ్ రేటింగ్‌ను A3 నుంచి A2కి అప్‌గ్రేడ్ చేసింది. దీనిపై ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పందిస్తూ ఈ అప్‌గ్రేడ్ భారత ప్రభుత్వం సమర్థవంతమైన ఆర్థిక విధానాలను ప్రతిబింబిస్తుందని పేర్కొంది. ఆర్థిక నిపుణులు కూడా ఈ రేటింగ్ అప్‌గ్రేడ్‌ను స్వాగతిస్తూ, దీని వెనుక జాగ్రత్తగా రూపొందించిన ఆర్థిక విధానాల ప్రభావం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఇన్వెస్టర్లకు అలర్ట్..

ఈ రోజు మార్కెట్ ట్రెండ్ చూస్తే ఇన్వెస్టర్లకు ఆశావాదం కనిపిస్తోంది. రష్యాయూఎస్ చర్చలు, జీఎస్టీ సంస్కరణలపై సానుకూల వార్తలు మార్కెట్‌ను బూస్ట్ చేశాయి. కానీ ఫార్మా, హెల్త్‌కేర్ సెక్టార్లు కాస్త వెనుకబడినందున, ఈ సెక్టార్లలో ఇన్వెస్ట్ చేసే వారు కొంచెం జాగ్రత్తగా ఉండాలి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ స్టాక్స్ కూడా మంచి గ్రోత్ చూపిస్తున్నాయి. కాబట్టి రిస్క్ తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నవారు వీటిపై ఓ కన్నేయొచ్చు.



భారత్‌లో శాంసంగ్ ల్యాప్‌ట్యాప్ తయారీ మొదలు..

## ధరలు తగ్గే ఛాన్స్ ఉందా?

దక్షిణ కొరియాకు చెందిన ప్రముఖ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శాంసంగ్ ఇప్పుడు భారతదేశంలో ల్యాప్‌టాప్‌ల తయారీ ప్రారంభించింది. ఈ చర్యతో భారత్‌లో శాంసంగ్ తయారీ విభాగంలో మరో కీలక మైలురాయిని చేరుకుంది. ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో ఉన్న ఫ్యాక్టరీలో ఈ కొత్త ఉత్పత్తి ప్రారంభమైనట్టు సమాచారం. ఇప్పటికే ఈ ప్లాంట్‌లో స్మార్ట్‌ఫోన్లు, ఫీచర్ ఫోన్లు, వేర్‌బుల్స్, టాబ్లెట్లు లాంటి పరికరాలను శాంసంగ్ తయారు చేస్తోంది. ఇప్పుడు ల్యాప్‌టాప్‌లు కూడా ఆ జాబితాలో చేరడం విశేషం.

**భారత మార్కెట్‌కి అనుగుణంగా నిర్ణయం**

ఈ నిర్ణయం వెనుక శాంసంగ్‌కు రెండు ప్రధాన లక్ష్యాలున్నాయని సమాచారం. ఒకటి భారతీయ వినియోగదారుల అవసరాలను తీర్చడం, మరొకటి గ్లోబల్ ఎగుమతులకు భారత్‌ను తయారీ కేంద్రంగా అభివృద్ధి చేయడం. కంపెనీ తన తయారీ పోర్ట్‌ఫోలియోను విస్తరించేందుకు ఈ ముందడుగు వేసింది. ఇటీవల కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, శాంసంగ్ సౌత్‌వెస్ట్ ఆసియా ప్రెసిడెంట్ జెబీ పార్క్, వైస్ ప్రెసిడెంట్ ఎస్‌పీ చున్ లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 'శాంసంగ్ దేశంలో అభివృద్ధి చెందిన పరికరాల తయారీలో భాగస్వామిగా నిలుస్తోంది. ఇది భారత్‌లోని స్థానిక ప్రతిభ, నైపుణ్యం, ఆవిష్కరణలపై ఆధారపడిన ముందడుగు' అని తెలిపారు.

1996లో స్థాపితమైన నోయిడా శాంసంగ్ ఫ్యాక్టరీ, భారత్‌లో మొదటి అంతర్జాతీయ ఎలక్ట్రానిక్స్ తయారీ ఫ్యాక్టరీల్లో ఒకటి. ఇప్పటివరకు ఇది భారీగా మొబైల్ ఫోన్ల ఉత్పత్తిలో కీలక పాత్ర పోషించగా.. ఇప్పుడు ల్యాప్‌టాప్‌ల తయారీ ప్రారంభంతో ఈ ప్లాంట్ ప్రాధాన్యం మరింత పెరిగింది.

ఈ సంవత్సరం ప్రారంభంలోనే శాంసంగ్ మొబైల్ ఎక్స్‌పీరియెన్స్ విభాగం ప్రెసిడెంట్ టీఎం రోహ్, ల్యాప్‌టాప్‌లను భారత్‌లో తయారు చేయాలనే యోచనతో ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పుడు అవి కార్యరూపం దాల్చాయి.

## అన్నింటిని వెనక్కి నెట్టి నంబర్ 1గా నిలిచిన ఎలక్ట్రిక్ స్కూటర్!



ఓలా ఎలక్ట్రిక్ మూడవ స్థానంలో ఉంది. కంపెనీ అమ్మకాలు గత సంవత్సరంతో పోలిస్తే 57.29 శాతం తగ్గి కేవలం 17,852 యూనిట్లకు చేరుకున్నాయి. గతంలో ఎలక్ట్రిక్ మార్కెట్‌లో ఆధిపత్యం చెలాయించిన ఓలా ఈసారి కఠినమైన సవాలును ఎదుర్కొంది. అలాగే.. భారత మార్కెట్లో ఎలక్ట్రిక్ స్కూటర్లకు డిమాండ్ రోజురోజుకూ వేగంగా పెరుగుతోంది. కానీ జూలైలో ఏ స్కూటర్ అత్యధికంగా అమ్ముడైందో మీకు తెలుసా? ఈ కాలంలో దేశంలోని పెద్ద కంపెనీలు బలమైన అమ్మకాలను నమోదు చేశాయి. దీనిలో మొదటి పేరు టీవీఎస్. ఇది అమ్మకాలలో అన్ని ఈవీలను వెనుకేసింది. కేవలం రూ.895 ప్లాన్‌తో 11 నెలల వ్యాలిడిటీ..జియోలో బెస్ట్ ప్లాన్

జూలై 2025లో మోటార్ మొత్తం 22,256 యూనిట్లను విక్రయించింది. ఈ సంఖ్య సంవత్సరానికి 13.23 శాతం వృద్ధిని సూచిస్తుంది. వంటి కంపెనీ అత్యంత ప్రజాదరణ పొందిన %జుప% మోడల్‌లు ఈ పనితీరులో ముఖ్యమైన పాత్ర పోషించాయి.

బజాజ్ ఆటో అమ్మకాల పరంగా రెండవ స్థానంలో నిలిచింది. జూలైలో కంపెనీ 19,683 యూనిట్లను విడుదల చేసింది. ఇది గత సంవత్సరం కంటే 10.80 శాతం ఎక్కువ. దీనితో పాటు చేతక్ %జుప% కి పెరుగుతున్న డిమాండ్ బజాజ్ గణాంకాలను బలోపేతం చేసింది. ఓలా ఎలక్ట్రిక్ మూడవ స్థానంలో ఉంది. కంపెనీ అమ్మకాలు గత సంవత్సరంతో పోలిస్తే 57.29 శాతం తగ్గి కేవలం 17,852 యూనిట్లకు చేరుకున్నాయి. గతంలో ఎలక్ట్రిక్ మార్కెట్‌లో ఆధిపత్యం చెలాయించిన ఓలా ఈసారి కఠినమైన సవాలును ఎదుర్కొంది. టీవీఎస్ ఐక్యూబ్ ధర: బ్యాటరీ కలిగిన బేస్ వేరియంట్‌తో ప్రారంభమవుతుంది. ఈ వేరియంట్‌కు 75 కి.మీ పరిధిని క్లెయిమ్ చేస్తుంది. ఈ వేరియంట్‌కు 0 నుండి 80 శాతం వరకు ఛార్జింగ్ సమయం 2 గంటలు ఉంటుందని, అన్ని మోడల్‌లు 950%ఔ% ఛార్జర్‌తో ప్రామాణికంగా వస్తాయి. బేస్ %ఱబపవ% గరిష్ట వేగం గంటకు 75 కి.మీ కంటే కొంచెం తక్కువగా ఉంటుంది. బరువు 115 కి.గ్రా. సీటు కింద స్టోరేజీ ప్రాంతం కొద్దిగా తక్కువగా ఉంటుంది.



## ఇదేదో అల్లాటప్పా ఆకురాయి కాదండోయ్..!

ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద వజ్రం కనుగొనబడిరది. ఈ అరుదైన, భారీ వజ్రం ఆఫ్రికాలో అత్యంత వజ్రాలు అధికంగా ఉండే ప్రాంతాలలో ఒకటైన బోట్స్వానాలోని కరోవే వజ్ర గనిలో కనుగొనబడిరది. దీనిని కెనడియన్ మైనింగ్ కంపెనీ లుకారా డైమండ్ కనుగొంది. ఇది రత్నంనాణ్యత గల వజ్రం. ఇది కుల్లినన్ డైమండ్ తర్వాత ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద వజ్రం.

**అది ఎన్ని క్యారెట్లు?**

ఈ వజ్రం బరువు 2,492 క్యారెట్లు. ఇది ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద వజ్రంగా నిలిచింది. దీనిని ఆగస్టు 2024లో కెనడియన్ మైనింగ్ కంపెనీ లుకారా డైమండ్ కార్ప్ కనుగొంది. ప్రపంచంలోనే అతిపెద్ద వజ్రం కుల్లినన్ వజ్రం. దీని బరువు 3,106 క్యారెట్లు, 1905 లో దక్షిణాఫ్రికాలో గుర్తించారు. ఈ వజ్రం నిర్మాణం, పారదర్శకత, పరిమాణం దీనిని చాలా అరుదుగా, విలువైనదిగా చేస్తాయి. భవిష్యత్తులో దీనిని మిలియన్ల డాలర్లకు అమ్మనున్నారు.. బోట్స్వానా ఆర్థిక వ్యవస్థకు వజ్రాల ఎగుమతులు 80 శాతానికి పైగా దోహదం చేస్తాయి. ఈ వజ్రాల అమ్మకం ద్వారా మౌలిక సదుపాయాలు, ఆరోగ్యం, విద్య వంటి రంగాలలో పెట్టుబడి పెట్టగల ప్రభుత్వ ఆదాయం గణనీయంగా పెరుగుతుంది. ఇప్పుడు వజ్రాన్ని ప్రాసెసింగ్ కోసం పంపించారు. అక్కడ దానిని చాలా చిన్నవిగా కానీ, చాలా విలువైన వజ్రాలుగా కత్తిరిస్తారు. బోట్స్వానా గనులు ఇంతకు ముందు కూడా చాలా పెద్ద వజ్రాలను ఉత్పత్తి చేశాయి. కానీ ఈ 2,492 క్యారెట్ల వజ్రం ఇప్పటివరకు అత్యంత ప్రత్యేకమైన వాటిలో ఒకటి.

# ఎక్కువ మైలేజ్ ఇచ్చే టాప్ 5 కార్లు.. ఇవే!

మార్కెట్లో ఎన్నెన్ని కార్లు వచ్చినా.. ఎక్కువ మైలేజ్ అందించే కార్లను కొనుగోలు చేయడానికే వినియోగదారులు ఆసక్తి చూపుతారు. దీనిని దృష్టిలో ఉంచుకుని కంపెనీలు కూడా కొంత ఎక్కువ మైలేజ్ ఇచ్చే కార్లను దేశీయ విఫణిలో లాంచ్ చేస్తున్నాయి. ఇందులో కేవలం పెట్రోల్ కార్లు మాత్రమే కాకుండా.. డీజిల్ హైబ్రిడ్ కార్లు కూడా ఉన్నాయి. ఈ కథనంలో ఎక్కువ మైలేజ్ ఇచ్చే కార్లను గురించి వివరంగా తెలుసుకుందాం.

**1. టయోటా హైరైడర్ & మారుతి గ్రాండ్ విటారా**

టయోటా హైరైడర్ & మారుతి గ్రాండ్ విటారా రెండూ కూడా వేరు వేరు కంపెనీ కార్లు అయినప్పటికీ.. ఇవి 27.97 కిమీ/లీ మైలేజ్ అందిస్తాయని సమాచారం. ఈ కార్లు 1.5 లీటర్ అట్కిన్సన్ సైకిల్ పెట్రోల్ ఇంజిన్ ద్వారా 92 హార్స్ పవర్, 122 న్యూటన్ మీటర్ టార్క్ ప్రొడ్యూస్ చేస్తాయి. వీటి ప్రారంభ ధరలు వరుసగా రూ. 6.84 లక్షలు, రూ. 8.34 లక్షలు (ఎక్స్ షోరూం).





**2. హోండా సిటీ ఈ:హెచ్ఈవీ**

హోండా కంపెనీకి చెందిన సిటీ ఈ:హెచ్ఈవీ అనేది హైబ్రిడ్ కారు. ఇది 27.26 కిమీ/లీ మైలేజ్ అందిస్తుంది. ఈ కారు 1.5 లీటర్ అట్కిన్సన్ సైకిల్ పెట్రోల్ ఇంజిన్ పొందుతుంది. ఇది 100 హార్స్ పవర్, 121 న్యూటన్ మీటర్ టార్క్ ప్రొడ్యూస్ చేస్తుంది. దీని ధర రూ. 19.90 లక్షలు (ఎక్స్ షోరూం).

**3. మారుతి సెలెరియో**

1.0 లీటర్ త్రీ సిలిండర్ పెట్రోల్ ఇంజిన్ కలిగిన మారుతి సెలెరియో.. 5 స్పీడ్ మాన్యువల్ గేర్‌బాక్స్ ద్వారా 26 కిమీ/లీ మైలేజ్ అందిస్తుందని ఏఆర్ఏఐ ధ్రువీకరించింది. ఇది 69 హార్స్ పవర్ ప్రొడ్యూస్ చేస్తుంది. దీని ప్రారంభ ధర రూ. 5.64 లక్షలు (ఎక్స్ షోరూం).

**4. మారుతి స్విఫ్ట్**

మారుతి సుజుకి కంపెనీకి చెందిన స్విఫ్ట్ కూడా ఎక్కువ మైలేజ్ అందించే కార్ల జాబితాలో ఒకటి. ఇది 25.75 కిమీ/లీ మైలేజ్ అందిస్తుందని తెలుస్తోంది. ఇందులో 1.2లీటర్ నేచురల్లీ ఆస్పిరేటెడ్ పెట్రోల్ ఇంజిన్ 5 మాన్యువల్, ఆటోమాటిక్ గేర్‌బాక్స్ ఆప్షన్స్ పొందుతుంది. దీని ప్రారంభ ధర రూ. 6.49 లక్షలు (ఎక్స్ షోరూం).

**5. మారుతి డిజైర్**

భారతదేశంలో ఎక్కువ అమ్మకాలు పొందుతున్న కార్ల జాబితాలో ఒకటైన మారుతి డిజైర్. ఎక్కువ మైలేజ్ ఇచ్చే కార్ల జాబితాలో ఒకటి. రూ. 6.48 లక్షల (ఎక్స్ షోరూం) ప్రారంభ ధర వద్ద లభిస్తున్న ఈ కారు.. 1.2 లీటర్ పెట్రోల్ ఇంజిన్ ద్వారా 82 హార్స్ పవర్, 112 న్యూటన్ మీటర్ టార్క్ అందిస్తుంది. 5 స్పీడ్ ఆటోమాటిక్ ట్రాన్స్‌మిషన్ కలిగిన డిజైర్.. 25.71 కిమీ/లీ మైలేజ్ అందిస్తుందని సమాచారం.

# యుద్ధం ముగించాల్సిందే

- అమెరికా చేరుకున్న ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్స్కీ
- అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, యూరప్ అగ్రనేతలతో కీలక సమావేశం
- రష్యాపై ఒత్తిడి పెంచి, శాశ్వత శాంతి సాధించడమే లక్ష్యమని వెల్లడి
- గతంలోలా భూభాగాలను వదులుకోబోమని జెలెన్స్కీ స్పష్టీకరణ
- ట్రంప్ వైఖరిపై, శాంతి ఒప్పందంపై యూరోపియన్ దేశాల ఆందోళన





ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని ముగించే దిశగా జరుగుతున్న దౌత్యపరమైన ప్రయత్నాలు కీలక దశకు చేరుకున్నాయి. రష్యాపై ఉమ్మడిగా ఒత్తిడి పెంచి, శాశ్వత శాంతిని సాధించే లక్ష్యంతో ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్స్కీ సోమవారం వాషింగ్టన్‌లో అడుగుపెట్టారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో పాటు పలు యూరోపియన్ అగ్రనేతలతో ఆయన జరపనున్న ఉన్నత స్థాయి సమావేశంపై ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ పర్యటన గురించి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో జెలెన్స్కీ స్వయంగా వెల్లడిరచారు. ''నేను ఇప్పటికే వాషింగ్టన్ చేరుకున్నాను. రేపు ట్రంప్‌తో, యూరోపియన్ నేతలతో సమావేశమవుతాను. ఈ యుద్ధాన్ని వేగంగా, నమ్మకంగా ముగించాలనే బలమైన కోరిక మా అందరిలో ఉంది. అయితే, ఈ శాంతి శాశ్వతంగా ఉండాలి'' అని ఆయన పేర్కొన్నారు. గతంలో క్రిమియా, డాన్‌బాస్‌లను వదులుకోవాల్సి వచ్చినట్లుగానో, 1994లో విఫలమైన భద్రతా హామీల వంటిదిగానో ఈ శాంతి ఉండకూడదని ఆయన స్పష్టం చేశారు. అయితే, ఈ సమావేశంపై యూరోపియన్ దేశాల్లో కొంత ఆందోళన వ్యక్తమవుతోంది. రష్యా అధ్యక్షుడు పుతిన్ డిమాండ్లకు అనుగుణంగా కొన్ని రాయితీలు ఇచ్చేలా జెలెన్స్కీపై ట్రంప్ ఒత్తిడి తీసుకురావచ్చని వారు భావిస్తున్నారు. క్రిమియాపై హక్కులను వదులుకోవడం, నాటోలో చేరబోమని హామీ ఇవ్వడం వంటి షరతులకు ఉక్రెయిన్‌ను అంగీకరింపజేసే ప్రయత్నం జరగవచ్చని వారు అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్, యూకే ప్రధాని కీర్ స్టార్మర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ వంటి అగ్రనేతలు జెలెన్స్కీతో పాటు వాషింగ్టన్ చేరుకున్నారు. ఈ భేటీ ద్వారా అమెరికా వైఖరిని స్పష్టంగా తెలుసుకోవాలని, ఉక్రెయిన్‌కు నమ్మకమైన భద్రతా హామీలు లభించేలా చూడాలని యూరప్ నేతలు లక్ష్యంగా పెట్టుకున్నారు. ''మనం ఇప్పుడు రష్యా ముందు బలహీనంగా కనిపిస్తే, భవిష్యత్తులో మరిన్ని ఘర్షణలకు పునాది వేసినట్లే అవుతుంది'' అని ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ హెచ్చరించారు. ఉక్రెయిన్‌కు దీర్ఘకాలిక భద్రతా హామీలు, సైనిక, ఆర్థిక సహాయం కొనసాగింపు, రష్యాపై ఆంక్షల ఒత్తిడి వంటి అంశాలు ఈ భేటీలో ప్రధాన అజెండాగా ఉంటాయని జర్మనీ ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. మరోవైపు, దొనెట్స్క్, సుమీ ప్రాంతాల్లో తమ సైనికులు విజయాలు సాధిస్తున్నారని జెలెన్స్కీ గుర్తుచేశారు. ఈ యుద్ధంలో తమకు మద్దతిస్తున్న అమెరికా, మిత్రదేశాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



# మంజీరా నది ఉగ్రరూపం

- ఆరో రోజు కూడా నీటిలోనే ఏడుపాయల వనదుర్గ ఆలయం
- సింగూరు ప్రాజెక్టు నుంచి నీటి విడుదలతో ఉప్పొంగిన మంజీరా నది
- అమ్మవారి పాదాలను తాకుతూ ప్రవహిస్తున్న వరద

ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గ ఆలయం ఆరో రోజు కూడా జలదిగ్బంధంలోనే కొనసాగుతోంది. సింగూరు ప్రాజెక్టు నుంచి భారీగా నీటిని దిగువకు విడుదల చేయడంతో మంజీరా నది ఉగ్రరూపం దాల్చింది. దీంతో ఏడుపాయల ఆలయ ప్రాంగణం మొత్తం వరద నీటితో నిండిపోయింది. ఆలయం వద్ద ఉన్న వనదుర్గ ఆనకట్టపై నుంచి వరద నీరు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ఈ వరద ప్రవాహం నేరుగా ఆలయ గర్భగుడిలోకి ప్రవేశించి, అమ్మవారి పాదాలను తాకుతూ రాజగోపురం ముందు నుంచి పారుతోంది. దీంతో ఆలయంలోకి భక్తులను అనుమతించడం సాధ్యం కాని పరిస్థితి నెలకొంది. గత ఆరు రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతుండటంతో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల దర్శనం కోసం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రాజగోపురం వద్ద ఏర్పాటు చేసి, అక్కడే పూజలు నిర్వహిస్తున్నారు. భక్తులు రాజగోపురం నుంచే అమ్మవారిని దర్శించుకుంటున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. వరద ప్రవాహం ఎక్కువగా ఉన్న గర్భగుడి వైపు, వనదుర్గ ఆనకట్ట వైపు భక్తులు వెళ్లకుండా పహారా కాస్తున్నారు. మంజీరా నదికి వరద తగ్గే వరకు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.








# ఢిల్లీలో నిరసన వ్యక్తం చేసిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య

- ఎన్నికల కమిషన్ తీరుపై ప్రతిపక్ష ఎంపీలతో కలిసి ఆందోళన
- ఓటర్ల జాబితా నుంచి భారీగా పేర్లు తొలగింపుపై తీవ్ర ఆక్షేపణ
- ఇది రాజకీయ పోరు కాదు, రాజ్యాంగ పరిరక్షణ కోసం యుద్ధమని స్పష్టం
- ఓట్ల దొంగతనం ఆగే వరకు నిరసన కొనసాగుతుందని హెచ్చరిక

ఢిల్లీ,తెలంగాణ ముచ్చట్లు:

ఎన్నికల కమిషన్ తీరును నిరసిస్తూ ఢిల్లీలో ప్రతిపక్ష పార్టీల ఎంపీలతో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య ఆందోళనలో పాల్గొన్నారు. బిహార్‌లో ఓటర్ల జాబితా విస్తృత సవరణ పేరుతో పెద్ద ఎత్తున ఓట్లను తొలగిస్తున్నారని, దేశవ్యాప్తంగా ఓట్ల చోరీ జరుగుతోందని ఆరోపించారు. సోమవారం పార్లమెంట్ భవనం వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు.
ఈ సందర్భంగా మాట్లాడిన ఎంపీ డా. కడియం కావ్య, ఇది రాజకీయ పోరాటం కాదని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు జరుగుతున్న యుద్ధమని స్పష్టం చేశారు. ఎన్నికల కమిషన్ వ్యవహార శైలి బీజేపీకి అనుకూలంగా మారిందని, దేశ ప్రజల ఓట్లను దోచుకోవడానికి కుట్ర జరుగుతోందని విమర్శించారు.ప్రతి ఒక్కరికీ ఒకే ఓటు ఉండే విధంగా నిజమైన, పారదర్శకమైన ఓటర్ల జాబితా కావాలని డిమాండ్ చేశారు. స్వచ్ఛమైన ఎన్నికల ప్రక్రియ దేశ ప్రజాస్వామ్యానికి బలమని గుర్తు చేశారు.రాహుల్ గాంధీ దేశ ప్రజలకు వాస్తవాలను తెలియజేశారని పేర్కొన్న ఆమె, ఓట్ల దొంగతనం పూర్తిగా ఆగే వరకు తమ నిరసన కొనసాగుతుందని స్పష్టం చేశారు.




# సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ను తొలగించాలంటూ పార్లమెంట్ లో కూటమి తీర్మానం!

- ఓట్ చోరీ ఆరోపణలతో ముదిరిన వివాదం
- రాహుల్ గాంధీకి వారం రోజుల అల్టిమేటం జారీ చేసిన సీఈసీ

ఎలక్షన్ కమిషన్, ఇండియా కూటమి మధ్య వివాదం ముదురుతోంది. రాహుల్ గాంధీకి వారం రోజులు గడువుతో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ అల్టిమేటం జారీ చేయడంపై ఇండియా కూటమి నేతలు భగ్గుమంటున్నారు. ఈ నేపథ్యంలో సీఈసీని తొలగించాలని పార్లమెంట్‌లో తీర్మానం ప్రవేశపెట్టేందుకు కూటమి నేతలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. సీఈసీని పదవిలో నుంచి తొలగించాలంటే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తొలగించే పద్ధతే పాటించాల్సి ఉంటుందని అధికార వర్గాలు తెలిపాయి. మూడిరట రెండొంతుల సభ్యుల మెజారిటీతో పార్లమెంట్ తీర్మానం పాస్ చేయాల్సి ఉంటుంది. మిస్ బిహేవియర్ లేదా సదరు బాధ్యతల నిర్వహణకు అర్హత లేదని నిరూపణ అయితే సీఈసీని పదవి నుంచి తొలగించవచ్చు. ఎన్నికల్లో అవకతవకలు జరుగుతున్నాయని, అధికార ఎన్డీయే కూటమి ఓట్ల చోరీకి ఎలక్షన్ కమిషన్ సహకరిస్తోందని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు తీవ్ర వివాదం రేపాయి. ఈ ఆరోపణలపై ఎలక్షన్ కమిషన్ ప్రత్యేకంగా ఆదివారం మీడియా సమావేశం ఏర్పాటు చేసింది. ఓట్ చోరీ అనే పదం ఉపయోగించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇది రాజ్యాంగాన్ని అవమానించడమేనని విమర్శించింది. ఎన్నికల జాబితాలో అవకతవకలు జరిగాయంటూ చేసిన ఆరోపణలకు సంబంధించి ఆధారాలు సమర్పించడంతో పాటు డిక్లరేషన్ ఇవ్వాలని రాహుల్ గాంధీని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ డిమాండ్ చేశారు. ఇందుకు ఏడు రోజులు గడువు ఇస్తూ ఆలోగా డిక్లరేషన్ ఇవ్వకుంటే తన ఆరోపణలు తప్పని ఒప్పుకుంటూ ప్రజలకు క్షమాపణ చెప్పాలని రాహుల్ గాంధీకి అల్టిమేటం జారీ చేశారు.

# పాఠశాల డ్రాప్ ఔట్‌ల నియంత్రణపై కేంద్రాన్ని ప్రశ్నించిన వరంగల్ ఎంపీ కడియం కావ్య

- లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా కడియం కావ్య దృష్టి సారింపు
- దేశవ్యాప్తంగా విద్యార్థుల పరిస్థితిని యూడైస్ ప్లస్ ద్వారా పర్యవేక్షణ
- 'పరఖ్' సర్వేక్షణతో విద్యా లోపాల గుర్తింపు, పరిష్కార చర్యలు
- మధ్యాహ్న భోజనం, స్కాలర్‌షిప్ పథకాలతో విద్య కొనసాగింపు



ఢిల్లీ,తెలంగాణ ముచ్చట్లు:

లోక్‌సభలో జరిగిన ప్రశ్నోత్తరాల సందర్భంగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య దేశంలో పాఠశాల విడిచిపెట్టే విద్యార్థుల సమస్యపై దృష్టి సారించారు. ఈ సమస్యను నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై ఆమె ప్రశ్నించగా, కేంద్ర విద్యాశాఖ మంత్రి జయంత్ చౌదరి సమాధానం ఇచ్చారు.
2019-20 నుండి 2023-24 వరకు ప్రాథమిక, పైప్రాథమిక, మాధ్యమిక స్థాయిలలో విద్యార్థుల పరిస్థితిని యూడైస్ ప్లస్(యూడిఐఎస్ఈ+) ద్వారా పర్యవేక్షిస్తున్నట్టు మంత్రి తెలిపారు. ఈ వేదికలో రాష్ట్రాల వారీగా, లింగం, వర్గాల వారీగా గణాంకాలు మాత్రమే కాకుండా, మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్, కంప్యూటర్లు, ఇంటర్నెట్ వంటి పాఠశాల సౌకర్యాల వివరాలు కూడా నమోదు అవుతున్నాయని వివరించారు.
'పరఖ్' రాష్ట్రీయ సర్వేక్షణ 2024 కింద గతేడాది డిసెంబరులో దేశవ్యాప్తంగా 74 వేలకుపైగా పాఠశాలల్లో మూడో, ఆరో, తొమ్మిదో తరగతుల విద్యార్థులపై సామర్థ్య పరీక్ష నిర్వహించామని మంత్రి తెలిపారు. 781 జిల్లాలను కవర్ చేసిన ఈ సర్వే ద్వారా విద్యా లోపాలను గుర్తించి, ప్రత్యేక చర్యలు చేపట్టేందుకు రిపోర్టులు సిద్ధం చేశామని చెప్పారు.
ఆర్థిక ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలు, పాఠ్యభారం వంటి అంశాల కారణంగా పాఠశాల విడిచిపెట్టే విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంటుందని 2017-18 జాతీయ నమూనా సర్వేలో తేలిందని మంత్రి గుర్తుచేశారు. దీనికి పరిష్కారంగా సమగ్ర శిక్షా పథకం కింద పాఠశాలలు, తరగతి గదులు, వసతి గృహాలు (కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు) నిర్మాణానికి కేంద్రం నిధులు అందిస్తున్నట్టు చెప్పారు. అదనంగా విద్యార్థులకు ఉచిత యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, రవాణా భత్యం, నమోదు కార్యక్రమాలు అందిస్తున్నట్టు వివరించారు.
ప్రాథమిక విద్యార్థులకు ప్రధానమంత్రి పోషణ శక్తి నిర్మాణ పథకం కింద ప్రతిరోజూ వేడి వంట భోజనం అందిస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు జాతీయ విద్యార్హత ఆధారిత స్కాలర్‌షిప్ పథకం కింద తొమ్మిదో తరగతి కొత్తగా చేరిన లక్షమంది విద్యార్థులకు వార్షికంగా పన్నెండు వేల రూపాయల చొప్పున స్కాలర్‌షిప్ ఇచ్చి, పన్నెండో తరగతి వరకు కొనసాగిస్తున్నట్టు చెప్పారు.
ఈ చర్యలన్నీ రాష్ట్ర ప్రభుత్వాల కృషికి తోడ్పడే విధంగా ఉంటాయని, వెనుకబడిన వర్గాల విద్యార్థులు పాఠశాలల్లో కొనసాగేలా చూడడమే తమ లక్ష్యమని విద్యాశాఖ మంత్రి జయంత్ చౌదరి లోక్‌సభలో స్పష్టం చేశారు.


# పలు పాఠశాలలకు బాంబు బెదిరింపులు




దేశ రాజధాని ఢిల్లీలో బాంబు బెదిరింపులు మరోసారి కలకలం రేపాయి. సోమవారం ఉదయం నగరంలోని పలు విద్యాసంస్థలకు ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. ద్వారకా ప్రాంతంలోని రెండు పాఠశాలలు, ఓ కళాశాలకు ఇవాళ ఉదయం బాంబు బెదిరింపులు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఈమెయిల్ ద్వారా ఆయా విద్యాసంస్థలకు బెదిరింపులు వచ్చాయి. దీంతో అప్రమత్తమైన యాజమాన్యం వెంటనే పోలీసులకు సమాచారం అందించింది. సోమవారం ఉదయం 7:24 గంటల సమయంలో బాంబు బెదిరింపులకు సంబంధించిన సమాచారం తమకు అందినట్లు ఢిల్లీ ఫైర్ డిపార్ట్‌మెంట్ తెలిపింది. సమాచారం రాగానే ఢిల్లీ పోలీసులు, ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఆయా విద్యాసంస్థల వద్దకు చేరుకుని తనిఖీలు చేపట్టారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సాయంతో పాఠశాలలు, కళాశాల ప్రాంగణంలో విస్తృతంగా సోదాలు నిర్వహించారు. అయితే, ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలూ, అనుమానాస్పద వస్తువులూ లభించలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. కాగా, గత నెల ఢిల్లీ, బెంగళూరు నగరాల్లోని పలు పాఠశాలలకు వరుస బాంబు బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. జులై 18న బెంగళూరులోని 40 స్కూల్స్, ఢిల్లీలోని 45 ప్రైవేట్ పాఠశాలలకు బెదిరింపులు వచ్చాయి. రంగంలోకి దిగిన పోలీసులు అవన్నీ బూటకపు బెదిరింపులుగా తేల్చారు. ఇలా వరుస బెదిరింపులతో పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు.

# డేంజర్ మార్క్ దాటిన యమునా నది..

**హత్నికుండ్ బ్యారేజ్ 18 గేట్లు ఎత్తివేత**



న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో యమునా నది డేంజర్ మార్క్ దాటి ప్రవాహిస్తోంది. ఆగస్టు 19వ తేదీ నాటికి 206 మీటర్ల మార్క్‌ను యమునా నది తాకనున్నట్లు కేంద్ర జల సంఘం పేర్కొన్నది. 205.33 మీటర్లను డేంజర్ మార్క్‌గా గుర్తిస్తున్నారు. ఒకవేళ నది 206 మీటర్లను తాకితే, అప్పుడు ఢిల్లీలో తరలింపు ప్రక్రియ చేపట్టనున్నారు. ఇవాళ ఉదయం 7 గంటల సమయంలో.. ఓల్డ్ రైల్వే బ్రిడ్జ్ వద్ద యమునా నది ప్రవాహం 204.8 మీటర్లుగా ఉన్నది. ఆదివారం సాయంత్రం204.6 మీటర్లుగా ఉన్నది. అయితే వార్నింగ్ మార్క్‌ను మాత్రం 204.5 మీటర్లుగా ఫిక్స్ చేశారు. గత రెండు రోజుల నుంచి వరుసగా వార్నింగ్ మార్క్‌పైనే నది ప్రవాహిస్తున్నట్లు గుర్తించారు. అన్ని ఏజెన్సీలు అప్రమత్తంగా ఉన్నట్లు అధికారులు చెప్పారు. వరద ఉధృతిని సమీక్షించేందుకు ఓల్డ్ రైల్వే బ్రిడ్జ్‌ను కీలకమైన పాయింట్‌గా భావిస్తారు. వజీరాబాద్, హత్నీకుండ్ బ్యారేజ్‌ల నుంచి వస్తున్న నీటితో.. ఢిల్లీలో యమునా నది నీటిమట్టం పెరిగింది. హత్నీకుండ్ నుంచి 58,282 క్యూసెక్కుల నీటిని రిలీజ్ చేశారు. వజీరాబాద్ నుంచి గంటకు 36,170 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అయితే ఈ నీరు ఢిల్లీని చేరేందుకు కనీసం 50 గంటలు పట్టే అవకాశం ఉన్నది. ఈ సీజన్‌లో తొలిసారి హత్నీకుండ్ బ్యారేజ్‌లో ఉన్న అన్ని 18 గేట్లను ఎత్తివేశారు. హర్యానా, పంజాబ్‌కు ఐఎండీ తాజా వార్నింగ్ ఇచ్చింది. ఆ రెండు రాష్ట్రాల్లో భారీ వర్షా లు పడే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నది. కర్నల్, ఇంద్రి, తనేసర్, అంబాలా, పాటియాలా, మొహాలీ, లుథియానాకు భారీ వర్ష సూచన ఉన్నది.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# బేబమ్మ అందాలతో అదరగొట్టిందిగా..

కృతి శెట్టి తెలుగు, తమిళ సినిమాల్లో పని చేస్తూ బిజీగా ఉంటుంది. ఈ ముద్దుగుమ్మ 2003 సెప్టెంబరు 21న కర్ణాటకలోని మంగళూరులో జన్మించింది, ముంబైలో పెరిగింది. ఆమె తండ్రి కృష్ణ శెట్టి వ్యాపారవేత్త, తల్లి నీతి శెట్టి ఫ్యాషన్ డిజైనర్. చిన్నతనం కృతి శెట్టి ఐడియా, షాపర్స్ స్టాప్, పార్లే, లైఫ్‌బాయ్ వంటి పలు బ్రాండ్‌ల వాణిజ్య ప్రకటనల్లో నటించింది. ఇక ఈ ముద్దుగుమ్మ తన కెరీర్ ను చైల్డ్ ఆర్టిస్ట్ గా ఇండస్ట్రీకి పరిచయం అయ్యింది. కృతి 2019లో హిందీ చిత్రం సూపర్ 30లో చిన్న పాత్రతో సినీ రంగంలోకి అడుగుపెట్టింది. కృతిశెట్టికి 2021లో వచ్చిన తెలుగు చిత్రం ఉప్పెనతో గుర్తింపు లభించింది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద రూ.100 కోట్లకు పైగా వసూలు చేసి విజయం సాధించింది. బుచ్చిబాబు సన దర్శకత్వంలో తెరకెక్కిన ఉప్పెన సినిమా భారీ విజయాన్ని అందుకుంది. అలాగే ఈ సినిమాలో కృతిశెట్టి నటనకు ప్రశంసలు అందాయి. ఆ తర్వాత ఆమె శ్యామ్ సింగరాయ్, బంగార్రాజు వంటి చిత్రాల్లో నటించి వరుస విజయాలతో హ్యాట్రిక్ సాధించింది. అయితే, ఆ తర్వాత ది వారియర్, మాచర్ల నియోజకవర్గం, కస్టడీ, మనమే వంటి కొన్ని చిత్రాలు కమర్షియల్ గా నిరాశపరిచాయి. దీంతో తెలుగులో కృతిశెట్టికి అవకాశాలు తగ్గాయి. ప్రస్తుతం ఈ చిన్నది తమిళ సినిమాలపై దృష్టి సారించింది. మూడు తమిళ ప్రాజెక్టుల్లో నటిస్తోంది. ప్రస్తుతం ఈ చిన్నది ప్రదీప్ రంగనాథ్ సరసన ఓ సినిమాలో నటిస్తుంది. లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ అనే టైటిల్ తో ఈ సినిమా తెరకెక్కుతుంది. ఈ సినిమాకు విఘ్నేష్ శివన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇక కృతిశెట్టి సినిమాల స్పీడ్ తగ్గించేసింది. కెరీర్ బిగినింగ్ లో వరుస సినిమా ఆఫర్స్ అందుకున్న ఈ చిన్నది. ఆతర్వాత ఆఫర్స్ కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఎదురైంది. ఉప్పెన సినిమా, బంగార్రాజు, శ్యామ్ సింగరాయ్ సినిమాతర్వాత చేసిన సినిమాలన్నీ ఫ్లాప్ అయ్యాయి. ప్రస్తుతం సినిమాలతో కంటే సోషల్ మీడియాతో బిజీగా మారిపోయింది ఈ చిన్నది.



# భుజాలపై మూటలు మోసుకెళ్తున్న అనుష్క..

టాలీవుడ్ బ్యూటీ అనుష్కా శెట్టి నటిస్తోన్న పాన్ ఇండియా చిత్రం ఘాటి . క్రిష్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. సెప్టెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు. కాగా మేకర్స్ మ్యూజికల్ అప్‌డేట్ అందించారు. ఈ మూవీ నుంచి సెకండ్ సింగిల్ అప్‌డేట్ అందించారు మేకర్స్. దస్సోరా సాంగ్‌ను ఆగస్టు 20న గ్రాండ్‌గా లాంచ్ చేయనున్నట్టు కొత్త లుక్ విడుదల చేశారు. విక్రమ్ ప్రభు, అనుష్క తమ భుజాలపై భారీ మూటలు మోస్తూ కొండలపై నుంచి వస్తున్న లుక్ పాటపై హైప్ క్రియేట్ చేస్తోంది. ఈ పాటను నాగవెల్లి విద్యాసాగర్ కంపోజ్ చేశాడు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో చైతన్య రావ్, జగపతి బాబు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఏప్రిల్‌లోనే విడుదల కావాల్సిన ఈ చిత్రం వాయిదా పడుతూ వస్తోన్న నేపథ్యంలో నిరాశ చెందుతున్న అభిమానులు, ఫాలోవర్లు ప్రమోషన్స్‌ను వేగవంతం చేయాలని అనుష్క టీంకు రిక్వెస్ట్‌లు పెడుతున్నారు. ఇప్పటికే ఈ మూవీ నుంచి విడుదల చేసిన జనాలంతా కొండ ప్రాంతం మధ్యలోని దారి వెంట మూటలు మోసుకొని వెళ్తున్న లుక్‌తో పాటు గ్లింప్స్ సూపర్ హైప్ క్రియేట్ చేస్తున్నాయి. ఘాటి అమెజాన్ ప్రైమ్ వీడియోలో పోస్ట్ థియాట్రికల్ రిలీజ్ కానుంది.

# ఎట్టకేలకు ఓటీటీలో మంచు విష్ణు కన్నప్ప..!

మంచు విష్ణు ప్రధాన పాత్రలో తెరకెక్కిన సినిమా కన్నప్ప. మైథలాజికల్ కథతో తెరకెక్కిన కన్నప్ప సినిమా థియేటర్స్ లో మంచి విజయాన్ని అందుకుంది. ఈ సినిమాకు బాలీవుడ్ దర్శకుడు ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు. గతంలో ‘మహాభారతం’ కు దర్శకత్వం వహించి మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు ముఖేష్. 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, ఏవీఏ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌లపై డాక్టర్ మోహన్ బాబు ఈ చిత్రాన్ని నిర్మించారు. కన్నప్ప పాన్‌ఇండియా స్థాయిలో ఐదు భాషల్లో (తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం)
ఇక ఈ సినిమాలో అతిథి పాత్రలలో మోహన్ బాబు, శివబాలాజీ, ప్రభాస్ (రుద్ర), అక్షయ్ కుమార్ (శివుడు), కాజల్ అగర్వాల్ (పార్వతి), మోహన్ లాల్, శివరాజ్ కుమార్, శరత్ కుమార్, ప్రీతి ముకుందన్ (హీరోయిన్), మధుబాల, బ్రహ్మానందం, రఘు బాబు తదితరులు నటించారు. సినిమా ఎక్కువ భాగం న్యూజిలాండ్‌లో చిత్రీకరించారు. ఈ సినిమా పలుసార్లు వాయిదా పడుతూ చివరకు జూన్ 27న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇప్పుడు ఈ సినిమా ఓటీటీ రిలీజ్ కోసం ప్రేక్షకులు ఈగర్ గా ఎదురుచూస్తున్నారు.మంచు విష్ణు మలిచిన కన్నప్ప సినిమాను మరోసారి ఓటీటీలో చూసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు ఆడియన్స్. విడుదలై చాలా రోజులవుతున్నా ఇప్పటివరకు కన్నప్ప ఓటీటీపై ఎలాంటి అప్డేట్ రాలేదు. మాములుగా సినిమా విడుదలైన 7 ఉంచి 8వారాల్లో ఓటీటీలోకి వచ్చేస్తుంది. కొన్ని సినిమాలు ముందే వచ్చే స్తాయి కూడా.. కానీ కన్నప్ప విడుదలై 10వారాలు అవుతున్నా ఓటీటీ అప్డేట్ లేదు. అయితే ఇప్పుడు కన్నప్ప సినిమా ఓటీటీలోకి రావడానికి రెడీ అవుతుందని తెలుస్తుంది. కన్నప్ప ఓటీటీ రైట్స్ ను ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ సొంతం చేసుకుందని తెలుస్తుంది. అలాగే ఈ సినిమాను సెప్టెంబర్ 5న ఓటీటీలోకి విడుదల చేయనున్నారని అంటున్నారు, మరి సెప్టెంబర్ 5న కన్నప్ప ఓటీటీలోకి వస్తుందా లేదా అన్నది చూడాలి.




# ప్రేయసితో సీక్రెట్‌గా ఎంగేజ్‌మెంట్ చేసుకున్న సింగర్ రాహుల్ సిప్లిగంజ్



నిన్న తన ప్రేయసి హరిణి రెడ్డితో నిశ్చితార్థం చేసుకున్న రాహుల్ హైదరాబాద్‌లో కొంతమంది అత్యంత సన్నిహితుల సమక్షంలో వీరి ఎంగేజ్‌మెంట్ ప్రస్తుతం రాహుల్ సిప్లిగంజ్ ఎంగేజ్‌మెంట్ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ బిగ్ బాస్ సీజన్ 3 విన్నర్, ఆర్‌ఆర్‌ఆర్‌లోని ‘నాటు నాటు’ పాటతో ఆస్కార్ విజేతగా నిలిచిన రాహుల్ సిప్లిగంజ్ తన ప్రేయసి హరిణి రెడ్డితో నిశ్చితార్థం చేసుకున్నాడు. ప్రస్తుతం వీరి ఎంగేజ్‌మెంట్ తాలూకు ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. నిన్న వీరి ఎంగేజ్‌మెంట్ హైదరాబాద్‌లో కొంతమంది అత్యంత సన్నిహితుల సమక్షంలో జరిగినట్టు సమాచారం. అయితే, రాహుల్ సిప్లిగంజ్ ప్రతి చిన్న విషయాన్ని కూడా అభిమానులతో షేర్ చేసుకుంటూ ఉంటాడు. కానీ, తన జీవితంలో ఇంత ముఖ్యమైన వేడుకను మాత్రం చాలా సీక్రెట్‌గానే ఉంచడం హాట్ టాపిక్‌గా మారింది. రాహుల్ కానీ, అతని కుటుంబ సభ్యులెవరూ కూడా ఈ ఎంగేజ్‌మెంట్ ఫొటోలను అధికారికంగా విడుదల చేయలేదు. కానీ సోషల్ మీడియాలో మాత్రం బాగా వైరల్‌గా మారాయి. దీంతో పలువురు అభిమానులు, నెటిజన్లు రాహుల్ సిప్లిగంజ్ కు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.కాగా, రాహుల్‌కు కాబోయే అర్ధాంగి హరిణి రెడ్డి గురించి ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. నిశ్చితార్థం సందర్భంగా రాహుల్ హరిణి రెడ్డి కలర్ ఫుల్ డ్రెస్సుల్లో మెరిసిపోయారు. మొత్తానికి ఈ జంట చూడముచ్చటగా ఉందంటూ అభిమానులు అభిప్రాయపడుతున్నారు. అలాగే తన పెళ్లిపై రాహుల్ అధికారిక ప్రకటన కోసం కూడా ఆయన ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇదిలా ఉంటే... నాటు నాటు పాటతో ఆస్కార్ అవార్డ్ అందుకున్న రాహుల్ సిప్లిగంజ్‌కి స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కోటి రూపాయల చెక్‌ని అందించిన విషయం తెలిసిందే.

# మహేష్‌తో స్పెషల్ సాంగ్, స్పెషల్ రోల్ చేసింది.. ఈ ముద్దుగుమ్మ ఎవరో గుర్తుపట్టారా..?

మహేష్ బాబు, సమంతా కాంబినేషన్‌లో దర్శకుడు శ్రీనువైట్ల తెరకెక్కించిన చిత్రం ‘దూకుడు’. ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర ఎంత పెద్ద హిట్ అయ్యిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మహేష్ కెరీర్‌లోనే వన్ ఆఫ్ ది బిగ్గెస్ట్ హిట్. మహేష్ కామెడి టైమింగ్, సమంతా స్క్రీన్ ప్రెజెన్స్, యాక్షన్, మ్యూజిక్.. ఇలా ఒకటేమిటి ఈ సినిమాకు హైలైట్‌గా ఎన్నో నిలిచాయి. ఇక ఈ చిత్రం ‘నీ దూకుడు.. సాటెవ్వరు’ అనే ఇంట్రో సాంగ్ గుర్తుంది కదూ.! అందులో నటించిన హాట్ బ్యూటీ ఎవరో తెల్సా.. ఆమె మహేష్ బాబు నటించిన ‘మహర్షి’ చిత్రంలోనూ ఆమె కీలక పాత్రలో నటించింది. ఆమె మరెవరో కాదు.. మీనాక్షి దీక్షిత్. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఈ అందాల భామ.. చిన్నప్పటి నుంచి కథక్, వెస్ట్రన్ డ్యాన్స్ నేర్చుకుంది. అలా సినీ అరంగేట్రం చేసింది. 2009లో లైఫ్ స్టైల్ అనే చిత్రం ద్వారా సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. అంతకుముందే మోడల్‌గా జోయాలుక్కాస్, మైక్రో సాఫ్ట్ విండోస్, ఫెయిర్ అండ్ హ్యాండ్సమ్ క్రీమ్, శంకరం డైమండ్ జువెలరీ, బ్రూక్ బాండ్ టాజా టీ, లీ కూపర్, రెడ్ స్క్వేర్ ఎనర్జీ డ్రిరక్ వంటి ప్రముఖ బ్రాండ్స్ చేసింది. అలా రెండేళ్ల గ్యాప్ తర్వాత 2011లో దూకుడు సినిమాలో ఐటెం సాంగ్ చేసింది. అలాగే వెంకటేశ్ బాడీ గార్డ్ చిత్రంలోనూ గెస్ట్ అప్పీయరెన్స్ ఇచ్చింది. శీకాంత్ దేవరాయ చిత్రంలో హీరోయిన్‌గా.. ఎన్టీఆర్ బాద్ షా మూవీలో ఓ సాంగ్‌లో.. మహర్షిలో కీలక పాత్రలో మెరిసింది ఈ బ్యూటీ. ఇలా మహేష్ బాబుతో రెండు సార్లు నటించింది ఈ అమ్మడు. ఆ తర్వాత నాగార్జున బంగ్రారాజు మూవీలో దేవ కన్యగా కనిపించింది. ఆ తర్వాత మరే తెలుగు చిత్రంలోనూ నటించలేదు. తెలుగుతో పాటు కన్నడ, మలయాళం, తమిళ్, హిందీ చిత్రాల్లో కూడా నటించింది మీనాక్షీ దీక్షిత్. అలాగే పలు మ్యూజిక్ ఆల్బమ్స్ కూడా చేసింది.ఇక సోషల్ మీడియాలో ఈ అమ్మడు చాలా యాక్టివ్ గా ఉంటుంది.



# రాజమౌళి చేతుల మీదుగా విడుదలైన రావు బహదూర్ టీజర్..

టాలీవుడ్ టాలెంటెడ్ యాక్టర్ సత్యదేవ్ గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. ఎన్నో సినిమాలలో వైవిధ్యమైన పాత్రలు పోషించి మెప్పించార . బ్లఫ్ మాస్టర్ సినిమా తర్వాత ఆయన నటనకు చాలామంది ఫిదా అయ్యారు. ఇటీవల జీబ్రా చిత్రంతో ఆకట్టుకున్న సత్యదేవ్ ఇప్పుడు రావు బహదూర్ అనే చిత్రంతో మరింత వినోదం పంచబోతున్నాడు. ఆయన నుంచి ఇంకా ఎక్కువ ఆశిస్తున్న వారికి ఈ మూవీ సమాధానం చెప్పేల కనిపిస్తుంది. “రావు బహదూర్” అనే టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రంలో సత్యదేవ్ పూర్తిగా భిన్నమైన లుక్‌లో కనిపించాడు. ఇటీవల విడుదలైన పోస్టర్‌ని చూసి ఇది ఫాంటసీ డ్రామా కానుందా? అనే ఆసక్తి కలుగుతుంది. ఈ చిత్రాన్ని కేరాఫ్ కంచరపాలెం దర్శకుడు వెంకటేష్ మహా తెరకెక్కిస్తున్నారు.”అనుమానం పెనుభూతం” అనే లైన్‌ను హైలైట్ చేస్తున్న నేపథ్యంలో ఇందులో ఊహించని ట్విస్ట్‌లు ఉంటాయని అర్థమవుతుంది.తాజాగా మూవీ టీజర్ రాజమౌళి చేతుల మీదుగా విడుదల చేశారు. టీజర్.. నాకు అనుమానం అనే భూతం పట్టిందనే ఆసక్తికర డైలాగ్‌తో ప్రారంభమైంది. సన్నివేశాలు ఇంట్రెస్టింగ్‌గా ఉన్నాయి. సైకలాజికల్ డ్రామాగా దీనిని తీర్చిదిద్దినట్టు టీజర్ చూస్తుంటే తెలుస్తుంది. వచ్చే సమ్మర్‌కి చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఈ చిత్రం ద్వారా సత్యదేవ్ నుంచి ప్రేక్షకులు కోరుకునే కొత్తదనం మళ్ళీ ఆయనలో చూడబోతున్నామని, మహేశ్వర ఉగ్రరూపస్య తరహా ఇంపాక్ట్‌ను వెంకటేష్ మహా మళ్ళీ అందించబోతున్నాడని అనిపిస్తోంది. ఈ చిత్రాన్ని శ్రీచక్ర ఎంటర్టైన్మెంట్స్, ఏ ప్లస్ ఎస్ సినిమాస్ నిర్మిస్తుండగా, సూపర్ స్టార్ మహేష్ బాబు, నమ్రత శిరోద్కర్ సమర్పిస్తున్నారు. ‘రావు బహదూర్’ అనేది ఓ రాజవంశం నేపథ్యంలో సాగే ఒక సైకలాజికల్ డ్రామా. దీనికి కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం, ఎడిటింగ్ వెంకటేష్ మహానే చేశారు. స్మరణ్ సాయి సంగీతం సమకూరుస్తుండగా.. కార్తీక్ పర్మార్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. రోహన్ సింగ్ ప్రొడక్షన్ డిజైనర్ గా వర్క్ చేస్తున్న ఈ చిత్రానికి దినేష్ యాదవ్ ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.




Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in